20.2.1998 శుక్రవారం 12 పేజీలు సంపుటి: 70 సంచిక: 8 విడిప్రతి రూ. 2.00లు Phone: 327354 Regd. No. HNL 18

# జమీన్ రైతు


జెంట్స్ రెడీమేడ్స్ - రియాన్స్
షర్ట్స్ ట్రౌజర్స్ బ్లౌజర్స్ సూట్స్ టైస్
సూటింగ్స్, షర్టింగ్స్, శారీస్,
డ్రెస్ మెటీరియల్స్
ఉదయాంజలి
VIMAL ఓన్లీ విమల్
మిల్స్ షోరూం
ట్రంకురోడ్, నెల్లూరు, ఫోన్: 320257

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

# ఆంధ్ర మరో బీహారైంది!



రాష్ట్రంలో తొలిదశ ఎన్నికలు అరాచకీయంగా ముగిశాయి. 16తేది పోలింగ్ జరిగిన ప్రతి నియోజక వర్గంలోనూ అక్రమాలకు, దౌర్జన్యాలకు, అసభ్య ప్రవర్తనకు పాల్పడింది తెలుగుదేశం పార్టీ. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌లో అరాచకం సృష్టించడానికి సందేహించలేదు - ఎన్నికల్లో విజయం కోసం! మున్నెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఎన్నికల శైలిని మార్చిపారేశా రాయన. ప్రజాస్వామ్యం అంటే పదవులు పొందడం మాత్రమేననే నూతన నిర్వచనం ఇచ్చారు. ఎట్లా గెలిపించావన్నది కాదు ప్రశ్న, ఎన్ని స్థానాలు గెల్చుకొని తెచ్చావన్నదే రాజకీయ సమర్థత అన్నతీరులో వ్యవహరించా రాయన.

ఇప్పటికి ఎన్నో ఎన్నికలు చూశాం; ఎందరో నేతలను చూశాం; ఎన్నో విషమ పరిస్థితులను ఎదుర్కొన్న అనుభవాలు చవిచూశాం. కాని ఈసారి పార్లమెంట్ ఎన్నికల వలె రాష్ట్రంలో మున్నెన్నడు ఏ ఎన్నిక జరగలేదు. సాధారణంగా రాయలసీమ వంటి ప్రాంతాలలో ఫ్యాక్షనిస్టులు; కోస్తా, తెలంగాణా ప్రాంతాలలో అక్కడక్కడా ప్యూడల్ భూస్వాములు ఎన్నికలలో రిగ్గింగ్‌కు పాల్పడడం మనకు తెలిసిన సంగతే! అదీఆయా స్థానిక పరిస్థితులకు, స్థానిక అవసరాలకు అనుగుణంగా జరిగిపోయేది. ఆ అరాచకత్వాన్ని ఈసారి వ్యవస్థీకృతం చేశారు చంద్రబాబు; ఆ దుర్మార్గ రాజకీయ పోకడలను రాష్ట్రమంతటికీ విస్తరింప జేశారు. ప్రజలలో అభిమానం వున్నా లేకున్నా

## విచ్చలవిడి రిగ్గింగ్‌తో ఎన్నికల వాతావరణం కలుషితం చేసేశారు!

పెత్తందారీ తనంతో ఎన్నికల్లో గెల్చే రౌడీ తత్వాన్ని ప్రవేశ పెట్టారు. ఎక్కడో బీహార్‌లో, ఉత్తర ప్రదేశ్‌లో ఇటువంటి సంఘటనలు జరుగుతుంటాయని పత్రికలలో చదివే వాళ్లం మనం! ఇప్పుడు వాటిని ప్రత్యక్షంగా చూశాం; చూస్తున్నాం!

తన పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులను వీధి గూండాలుగా మార్చిపారేశాడు ముఖ్యమంత్రి. ఏ ఏ నియోజక వర్గంలో ఎవరెవరు ఎట్లెట్లా అరాచకం సృష్టించాలో స్వయంగా తానే పథకం రచించి, శిక్షణ ఇచ్చాడు ముఖ్యమంత్రి. దాని ఫలితంగానే దేశమంతటా మొదటి దశ పోలింగ్‌లో 600 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల కమిషన్ రీపోలింగ్‌కు ఆదేశం ఇస్తే అందులో 300 కేంద్రాలు ఆంధ్ర ప్రదేశ్‌లోనే వున్నాయి. ఒక్క పెనుగొండ అసెంబ్లీ నియోజక వర్గంలో 72 బూతుల్లో రీపోలింగ్ జరపవలసి వచ్చింది.

గ్రామస్థాయిలో, వర్గాల పెత్తనంతో, స్థానికులు రిగ్గింగ్‌కు పాల్పడి నందు వల్ల ఈ పరిస్థితి ఏర్పడలేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అభ్యర్థులు, రౌడీ గ్యాంగ్‌లను వెంటబెట్టుకొని; బాంబులు విసిరి; కత్తులతో పొడిచి; స్వయంగా తామే బూత్‌లలోకి జొరబడి, బ్యాలెట్ పత్రాలపై తమ చేతితోనే గుర్తులు వేయడం వల్ల ఈ పరిస్థితి దాపురించింది. కర్నూలులో మంత్రి కెఇ. ప్రభాకర్, నరసరావుపేటలో మంత్రి కోడెల శివప్రసాద్, తిరుపతిలో మంత్రి పరసారత్నం, బాపట్లలో కేంద్ర మంత్రి ఉమ్మారెడ్డి

తరువాయి 7వ పేజీలో

## 'ఈనాడే' చెప్పింది!

ప్రక్కనున్న బొమ్మ చూడండి; ఈ రోజు (20తేది) ఈనాడు దినపత్రిక కార్టూన్ అది. రిగ్గింగ్‌కు పాల్పడింది తెలుగుదేశం అభ్యర్థులేనని చెప్పడానికి - రెండు చేతివేళ్ల గుర్తును స్పష్టంగా చూపించాడు కార్టూనిస్టు. అది చంద్రబాబు ప్రతి సభలోనూ ప్రదర్శించిన గుర్తు. ఈనాడు అంటే చంద్రబాబు స్వంత కరపత్రం. అదే రిగ్గింగ్‌కు మూలపురుషుడు ఆయనేని చెప్పిందంటే ఇంక పరిస్థితి ఎంత ఘోరంగా వుండిందో ఆలోచించు కోవచ్చు.



# మెజారిటీలు అనూహ్యంగా వుండబోతాయి!

## చంద్రబాబుపై వ్యతిరేకతతో కాంగ్రెస్ గాలి * బిజెపి వ్యామోహం తెదేను మరీ ముంచింది!

రాష్ట్రంలో ఈసారి ఎన్నికల ఫలితాలు దిగ్ర్భమ గొల్పేవిగా వుంటాయని రాజకీయ పండితుల అంచనా. తొలిదశ పోలింగ్ పూర్తయిన 21 స్థానాలలో ఓటింగ్ తీరును విశ్లేషిస్తే ఈ అభిప్రాయం కల్గుతుంది. ఓటింగ్‌కు, కౌంటింగ్‌కు మధ్య రెండు వారాల వ్యవధి వుంచి ఎన్నికల కమీషన్ రాజకీయ వాదులకు నరకం చవి చూపిస్తున్నది. చాలా సిగ్గు పడవలసిన విషయమిది. ప్రపంచ వ్యాప్తంగా ఏ అభివృద్ధి చెందిన దేశంలోనూ ఈ పరిస్థితి వుండదు. అమెరికా, ఇంగ్లండ్ వంటి అగ్రరాజ్యాలే కాదు - తైవాన్ వంటి బుల్లి దేశాలలో కూడా పోలింగ్ పూర్తయిన ఐదంటే ఐదు నిమిషాలలో ఫలితం ప్రకటింప బడుతుంది. ఎలక్ట్రానిక్ సమాచార వ్యవస్థను, తతిమా ప్రపంచ మంతా అంత సమర్థవంతంగా వినియోగించు కొంటుంటే - మనం మాత్రం 18 శతాబ్దం నాటి స్థితిలో ఎన్నికలు జరుపుకొంటున్నాం, కౌంటింగ్ ఆలస్యం వల్ల బ్యాలెట్ పెట్టెలు రెండు వారాల పాటు చీకటి గదిలో మ్రగ్గి పోవాల్సి వస్తుంది. అవి వెలుగు చూసే వరకు అభ్యర్థులకు, వారి అనుచరులకు నిద్రపట్టదు, అన్నం సగించదు; అంతదాకా మామూలు జనానికి సైతం వూహాగానాలే కాలక్షేపం.

ఓటింగ్ సరళి పరిశీలించి చూసిన వారెవరికైనా ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనూహ్యమైన మెజారిటీలతో గెలవబోతుంది అన్పిస్తూంది. 1978 నాటి ఇందిరమ్మ ప్రభంజనాన్ని తిరిగి మరొక సారి సోనియా గాంధీ రూపంలో ఆంధ్ర రాష్ట్రం సందర్శించ బోతున్నాదా అన్పిస్తూంది. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం తుడిచి పెట్టుకపోయే పరిస్థితులు

## తెలుగుదేశానికి ఓర్చుకోలేని అవమానాలు ఎదురౌతాయి!

ఏర్పడు తున్నాయనే అభిప్రాయం ఎన్నికలకు ముందు నుంచే వుంది. పోలింగ్ తర్వాత అది మరింత బలపడడడంతో పాటు, మెజారిటీలు సైతం వూహకందని తీరులో వుంటాయన్న భావన ఏర్పడుతున్నది.

చంద్రబాబు పట్ల ప్రజలలో వున్న వ్యతిరేకత పోలింగ్ బూత్‌ల వద్ద పబ్లిక్‌గా ప్రత్యక్షమైంది. ఎప్పుడూ ఓటింగ్‌కు రాని మధ్య తరగతి, సంపన్న వర్గాలకు చెందిన మహిళలు సైతం ఒక విధమైన కక్షతో బూత్‌లకు వచ్చి ఓట్లు వేసి వెళ్లారు. ఈ వ్యతిరేకత క్రమక్రమంగా కాంగ్రెస్ గాలిగా మారింది. సోనియా ప్రవేశంతో ముస్లింలు, క్రైస్తవులు మూకుమ్మడిగా కాంగ్రెస్‌ను వరించారు. బిజెపి భయం కూడా వారిలో కన్పించింది. సాంప్రదాయక కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు ఒకేసారి ఇన్ని వర్గాల ఓట్లు జత కలవడంతో కాంగ్రెస్ గుర్తు కల బ్యాలెట్ పత్రాలు గుట్టలు గుట్టలుగా పెట్టెల్లో పడ్డాయని అంచనా.

ఇంకొక ప్రక్క బిజెపి వ్యామోహం సైతం తెలుగుదేశాన్ని దెబ్బ తీసింది. కాంగ్రెస్ నుంచి కంటే తెలుగుదేశం నుంచే అధికంగా ఓట్లను చీల్చుకున్నారు కమలనాథులు. యాదవ, గౌడ వంటి వెనుకబడిన తరగతుల ఓట్లు ఈసారి బిజెపి జోలెలో పడుతాయని అందరూ అంచనా కట్టారు. అయితే విచిత్రంగా వాటితోపాటు కమ్మకులస్తుల ఓట్లు కూడా బిజెపి ప్రక్కకు తరలి వెళ్లాయి సాంప్రదాయకంగా [illegible] తెలుగు దేశం వీరాభిమానులు. అయితే చంద్రబాబు తీరుపట్ల వ్యతిరేకతతో,

తరువాయి 7వ పేజీలో

# పదవుల కోసం ప్రాణాలు బలి పెట్టాలా?

## నెత్తుటి కూడు గతికే నీచత్వానికి దిగజారారు

అనుకున్నట్లే జరిగింది. ఒంగోలు నియోజక వర్గం మొత్తం మీద భారీగా రిగ్గింగ్ జరపడానికి తెలుగుదేశం నేతలు విశ్వ ప్రయత్నం చేశారు. చిన్నా, చితక ప్రయత్నం కాదది; ప్రజాస్వామ్య విలువలు, సాంప్రదాయాలను సజీవంగా నిలువులోతు గోతిలో పాతిపెట్టేందుకు చేసిన ప్రయత్నమది. గెలుపు మీద ఏ మాత్రం లేని నిస్పృహతో; ఏమి చేసైనా గెల్చి తీరాలనే మూర్ఖత్వంతో; తమ పార్టీయే అధికారంలో వుందన్న అహంభావంతో అమిత దూకుడుగా, అత్యంత దుర్మార్గంగా ప్రవర్తించారు తెలుగుదేశం అభ్యర్థి, ఆయన మద్దతు దారులైన ఎమ్మెల్యేలు. కడప, అనంతపురం వంటి రాళ్ల సీమకే పరిమితమై వుండిన రౌడీ రాజకీయ పోకడలను అచ్చు గుద్దినట్లు ఒంగోలుకు దిగుమతి చేశారు వారు.

ఈ అరాచక ప్రవృత్తికి కేంద్ర స్థానంగా మారింది ఉదయగిరి. అభ్యర్థి రాజమోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే విజయరామిరెడ్డికి కూడా ఇది స్వస్థానం కావడంతో విచ్చల విడిగా ప్రవర్తించారు వారు. తమ వాహనాల్లోనే బాంబులు, కత్తులు కటార్లు, రౌడీలను నింపుకొన్నారు; సినిమాల్లో చూపించినట్లు జనం గుండెలు అదర గొడుతూ పోలింగ్ బూత్‌ల్లోకి ప్రవేశించారు; లోపలున్న ఏజంట్లను తరిమేసి, పోలింగ్ ఆఫీసర్ల ముందు నోట్ల కట్టపెట్టి, బ్యాలెట్ పత్రాలు పెరుక్కొని, గబగబా గుద్దేశారు; ఈ తతంగం జరిగినంత సేపూ రాజమోహనరెడ్డి వాకిట్లోనే నిలబడ్డారు; ఎవరు అభ్యంతరం చెప్పబోయినా కత్తులు చూపి బెదరించారు; ఎస్ఐ వంటి పోలీసులను దౌర్జన్యంగా ప్రక్కకు నెట్టేశారు; లోపల పనికాగానే అందరూ కలిసి ప్రక్క గ్రామం వెళ్లడం - అక్కడ ఇదే తతంగం. పత్రికా విలేఖర్లనూ పురుగుల మాదిరి దులపరించి పారేశారు.

దుత్తలూరులో ఎమ్మెల్యే విజయ రామిరెడ్డి కుటుంబ మహిళలు వీరనారుల వలె వ్యవహరించారు. పోలింగ్ బూత్‌లో కూర్చుని, పదిహేను మంది మహిళలను దగ్గర పెట్టుకుని, పబ్లిక్‌గా రిగ్గింగ్ జరిపించారు వారు. అక్కడ కాంగ్రెస్ ఏజంట్‌గా వుండిన నారాయణమ్మను బయటకు పంపించేశారు. ఏ మాత్రం ఎవరు పెదవి విప్పినా తాటలేచి పోతుందన్న భయోత్పాతం కల్గించారు.

ఈ అరాచక తత్వం ఫలితంగా దుత్తలూరు మండలం సోలమరేగడ, సంజీవరాజుపాలెం గ్రామాలలో బ్యాలెట్ బాక్సులు బయటకు తెచ్చి, పగల గొట్టేశారు; డిసి పల్లెలో చాలా సేపు పోలింగ్ ఆగిపోయింది. జడదేవిగ్రామంలో ఘర్షణ జరిగింది; గానుగపెంట, అల్లంపాడు గ్రామాలలో బ్యాలెట్ బాక్సలలో నీళ్లు పోశారు. ఉదయగిరి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ప్రచార సారథి పివి. ప్రసన్నరెడ్డి కారును ధ్వంసం చేశారు. బ్రాహ్మణ పల్లెలో ఆయననూ అటకాయించి అల్లరి చేయడంతో గన్‌మెన్ గాలిలోకి కాల్పులు జరపవలసి వచ్చింది. చిలకపాడులో రాజమోహన్‌రెడ్డి జరిపిస్తుండిన రిగ్గింగ్‌ను ఫోటో తీశారనే కోపంతో వార్త దినపత్రిక విలేఖరిని, ఈటివి కెమెరామెన్‌ను తన్నబోయి, ఫిల్ములు పెరుక్కొని, ధ్వంసం చేసేశారు.

కొండాపురం మండలం ఇస్కదామెర్ల గ్రామంలో కాంగ్రెస్ ఏజంటు ఇరిగెల కృష్ణారెడ్డిని బూత్ బయటకు లాక్కొని వచ్చి, కత్తితో పొడిచి చంపేశారు.

కొండపి నియోజక వర్గంలో ఇదే తీరులో మరి ఇద్దరిని చంపేశారు; ముగ్గురు వ్యక్తులు చావు బ్రతుకుల్లో వున్నారు. చీమకుర్తిలో గ్రామం రెండుగా చీలిపోయి పెద్ద పెద్ద రాళ్లతో కొట్టుకున్నారు; ఎందరికి ఎంతెంతటి గాయాలు తగిలిందీ తెలియదు. సంతనూతలపాడు నియోజక వర్గంలోనూ, ఒంగోలు టౌన్‌లోనూ కూడా ఇటువంటి సంఘటనలే జరిగాయి.

ఎలక్షన్ అబ్జర్వర్లు, పోలీసు యంత్రాంగం, కలెక్టరాధికారులు తెలుగుదేశం అరాచకీయాన్ని ఏమీ చేయలేక పోయారు. ఇంతటి దుర్మార్గాలు, దౌర్జన్యాలు చేసి, బ్యాలెట్ పత్రాలను రక్తంతో మలినం చేసి, పదవులు పొందాలా? నెత్తురు కూటిని తినే నీచత్వానికి రాజకీయ వాదులు దిగజారి పోవాలా? ఏమి సాధిస్తారు వారు ఈ పదవులు పొంది? ఇప్పుడుండే కోట్ల ధనరాశులకు మరికొంచెం జమ చేసుకోగల్గడం తప్ప, తమ వ్యాపారాలను మరింత పెంచుకోవడం తప్ప వీరు సాధించే దేముంది? అందుకోసం ఇంత కక్కుర్తి పడాలా? ఇంత రాక్షసత్వంగా వ్యవహరించాలా? ఇందరి ప్రాణాలు బలిగొనాలా?

ఎన్నికలు ముగిసిన ప్రక్క క్షణం నాయకులందరూ ఒకటే; ఏ కృష్ణ ఒబెరాయ్ గదుల్లోనో, విమానాలల్లోనో వీరు కలుస్తుంటారు; ముచ్చట్లాడు కుంటారు; వ్యాపార లావాదేవీలు జరుపుతుంటారు. ఈ ఎన్నికల టెన్షన్‌లు వారి మనసులను తాకనే తాకవు. ఒక్క ఒంగోలే కాదు - ఎక్కడైనా, ఏ పార్టీకి చెందిన వారైనా, ఎంత పెద్ద రాజకీయ నేతలైనా ఇదే తంతు. పైగా అట్లా కలిసి తిరగడం తమ విశాల దృక్పథానికి చిహ్నమన్నట్లు ఫోజులిస్తుంటారు. ఇక్కడ గ్రామాలలో మాత్రం అమాయక జనం వారి ఔన్నత్యం కోసం తమ ప్రాణాలు బలి చేస్తుంటారు; తమ జీవితాలు నాశనం చేసుకొంటుంటారు. రాజకీయ పార్టీల కోసం కార్యకర్తలనే వారు పనిచేయడం ఇక వ్యర్థం; రాజకీయాలు ప్రజలకోసం, ప్రజాస్వామ్యం కోసం నడుస్తుంటే కార్యకర్తలు తమ సమయం వెచ్చించవచ్చు; మరింత ఎక్కువ సంపాదించు కోవడం కోసం రాజకీయాలలోకి వచ్చే వ్యాపారుల కోసం ఎవరు మాత్రం ఎందుకు పనిచేయాలి?

అది తెలుగుదేశం కానీ, కాంగ్రెస్ కానీ - ఒంగోలులో జరిగింది గర్హనీయం; ఎన్నికలను రక్తసిక్తం చేసే అభ్యర్థులను ప్రజా జీవితం నుండి బహిష్కరించే రోజు రావాలి! *

**ఒంగోలు ఎన్నికల ఘర్షణల్లో ముగ్గురి మరణం! ఎవరి కోసం ఎందుకోసం ఏమి సాధించను వీరి చావు?**

**ఎన్నికల్లో హింసను ప్రేరేపించే రాజకీయ నాయకులను వెలివేసే మంచి రోజు ఎప్పుడు వస్తుందో!**

# ఎరగడ్డల ధరలు భూమార్గం పట్టాయి!

ఇంత కాలం ఆకాశపు దారులెంట హడావుడిగా తిరుగుతుండిన ఎర్రగడ్డల ధరలు భూమార్గం పట్టే సూచనలు కన్పిస్తున్నాయి. ఎగుమతులు, పంటనష్టం, బ్లాక్ మార్కెట్ పంటి వాటి వల్ల ఎర్రగడ్డల ధరలు ఒక్కసారిగా పెరిగి పోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత ప్రయత్నించినా వాటిని అదుపు చేయడం అలివి కాలేదు. ఇప్పుడు వీటి ధర రు 15 నుంచి 18 వరకు వుంది.

**మహారాష్ట్రలో పంట బాగా పండడంతో ధరలు పడి పోతున్నాయి!**

అయితే ఫిబ్రవరి 18తేది ఉదయం ఉన్నట్లుండి ధరలు 18 నుంచి 10 రూపాయలకు పడిపోయాయి. పునా, నాసిక్, అహ్మద్ నగర్ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఎర్రగడ్డలు మార్కెట్‌కు తరలి రావడంతో ఈ మార్పు. గత 3నెలలుగా బొంబాయి మార్కెట్‌కు రోజుకు 25 నుంచి 30 లారీలు మాత్రమే వస్తుండినాయి; 18 తేది ఒకే రోజు 150 లారీలు వచ్చాయి. ఇంకొక వారం రోజుల లోపల వీటి సంఖ్య రోజుకు 500 లారీలకు పెరిగినా ఆశ్చర్యం లేదు. మహారాష్ట్రలో ఎర్రగడ్డల పంట దిగుబడి సంతృప్తికరంగా వుండడమే ఇందుకు కారణం.

అయితే గుజరాత్, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లో మాత్రం పంట దిగుబడి

తరువాయి 7వ పేజీలో

## మహిళలకు మంచి భీమా పథకం

ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ కేవలం మహిళల కోసం ఒక ఇన్సూరెన్స్ పథకం ప్రవేశ పెట్టింది. దీని పేరు - 'రాజరాజేశ్వరి మహిళా కళ్యాణ్ భీమా యోజన'! 10 నుంచి 75 సంవత్సరాల లోపు మహిళ లందరికీ వర్తించే పథకం ఇది. 10 వేల నుంచి లక్ష రూపాయల మొత్తానికి భీమా పాలసీ తీసుకోవచ్చు. పాలసీ ప్రీమియం 10 వేల రూపాయలకు కేవలం 55 రూపాయలు; ఈ మొత్తం ఒకేసారి కట్టి, పాలసీ తీసుకొంటే - గర్భధారణ, సిజేరియన్ ఆపరేషన్, ప్రసవ సమయంలో సమస్యలు, గర్భసంచి తీసివేసే ఆపరేషన్, రొమ్ము క్యాన్సర్ వంటి చికిత్సలకు ఆర్థిక సహాయం చేస్తారు. ప్రమాదాలలో అంగవైకల్యం ఏర్పడితే నష్ట పరిహారం చెల్లిస్తారు. పాలసీ కాల పరిమితి ఐదు సంవత్సరాలు.

# షేర్ మార్కెట్ చాలా ఛండాలంగా వుంది!

షేర్ మార్కెట్ పరిస్థితి ఛండాలంగా వుంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీకి మెజారిటీ రాబోదని, మళ్లీ హంగ్ పార్లమెంట్ తప్పదని వస్తున్న పుకార్లు ఒక ప్రక్క; గల్ఫ్ వార్ తప్పదన్న భయం ఇంకొక ప్రక్క మార్కెట్‌ను సంక్షుభితం చేస్తున్నాయి. ఒక గంట షేర్ల ధరలు పెగిరితే, ప్రక్క గంటలో పడిపోతున్నాయి.

ఈ వారంలో ఎంటిఎన్ఎల్ షేర్ ధర బాగా పెరిగింది. బుధవారం ఒక్కరోజు రు15ల ధర పెరుగుదలతో రు238కి చేరింది. నిజానికి ఈ కంపెనీ షేర్ పతనం కావలసిన సమయం ఇది. సెల్యూలర్ ఫోన్సు మార్కెటింగ్‌కి వీరికి లభించి వుండిన లైసెన్స్‌ను టెలికాం రెగ్యులేటరీ అథారిటీ రద్దు చేసింది. అయినా షేర్ ధరలో హెచ్చు తప్ప, తగ్గు కానరాలేదు. అదే షేర్ల మాయ అంటే!

స్మిత్ క్లిన్ ఫార్మా కంపెనీ మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో పాటు, బోనస్ షేర్ ఇస్తానని చెప్పడంతో వారి షేర్ రు600లకు ఎగబ్రాకింది. రాశి సిమెంట్‌ది మరీ విచిత్రం. వారి షేర్ ధర రెండు నెలల్లో రు 55 నుంచి 165లకు పెరిగింది. ప్రతి రోజూ రెండు లక్షల షేర్ల

**బిజినెస్ న్యూస్**

డాక్టర్ ఎ. దుర్గాప్రసాద్

తరువాయి 7వ పేజీలో

# రైతు దుర్గతి పట్టదా?

రాష్ట్రంలో పత్తి రైతుల ఆత్మహత్యలు ఒక క్రమం తప్పని కార్యక్రమంగా కొనసాగిపోతూ వున్నాయి. ఉదయం నిద్రలేవగానే దిన పత్రిక వాకిట్లో పడివుండడం ఎంత నియమ బద్ధంగా జరిగిపోతుందో - ఆ దినపత్రికలో పత్తిరైతుల ఆత్మహత్యల వార్తలు సాక్షాత్కరించడమూ అంతే క్రమ బద్ధంగా జరుగుతున్నది. మొదట మొదట పత్రికల వాళ్లు మొదటి పేజీల్లో ప్రముఖంగా ప్రకటించే వారు; ఇప్పుడు లోపలి పేజీల్లో సింగిల్ కాలం వార్తలుగా పరిగణిస్తున్నారు. కొన్ని పత్రికలైతే నలుగురైదుగురు రైతుల చావును సంక్షిప్తీకరించి, నాలుగైదు వాక్యాల్లో క్లుప్తంగా వ్రాసిపారేస్తున్నాయి.

రైతు బ్రతుకుకు పట్టిన దుర్గతి ఎవరికీ పట్టడం లేదు; ఎవరిలోనూ ఆందోళన లేదు; స్పందన అసలే లేదు; అధికారులు ఇది తమ పరిధిలోని అంశం కానట్లు తప్పించు కొంటున్నారు; రాజకీయ పార్టీలు ఈ చావులనొక ఎన్నికల నినాదంగా, వివాదంగా మాత్రమే పరిగణించి వదిలేస్తున్నాయి; ప్రజలలోనూ కదలిక లేదు.

ఏమిటీ అన్యాయం? ఎందుకింత ఘోర నిర్లక్ష్యం? ఈ సమాజం, ఈపాలకులు, ఈ ప్రభుత్వాలు రైతుకు ఇచ్చే విలువ ఈపాటిదేనా? ఒక వ్యక్తి తన జీవితాన్ని అంతం చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చాడంటే - అంతకు కొన్ని రోజుల క్రితం నుంచి అతడి మనసులో ఎంతటి ఆవేదన గూడుకట్టుకొని వుంటుందో ఆలోచించండి! ఎంతగా కుమిలి పోకపోతే; ఎంతగా జీవితంపై విరక్తి కల్గకపోతే, ఎంతగా బ్రతుకు పట్ల భయం ఏర్పడకపోతే, ఎంతటి నిస్సహాయత నిలువెల్లా ఆవరించకుంటే - చావు తప్ప శరణ్యం లేదనే నిర్ణయం తీసుకొంటారు? వ్యక్తిగతంగా కాక, ఒక వర్గ పరంగా, ఒక కమ్యూనిటీ పరంగా రైతాంగం యావత్తు ఇటువంటి విషాదకర నిర్ణయాలు తీసుకొంటుంటే ఎవరూ పట్టించుకోక పోవడం, ఎవరిలోనూ కదలిక లేకపోవడం, ఆదుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడం ఎంత ఘోరం ? ఎంత దారుణం? ఎంత విస్మయకరం?

ఇప్పటి వరకు 175 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అంచనా. ఈ సంఖ్య స్థిరం కాదు; ప్రతి రోజూ అదనపు అంకెలు దానికి జత కలుస్తూనే వున్నాయి. అందరి చావుకూ ఒకటే కారణం - అప్పులు! అవేమీ అలివిమాలినవి కావు; పాతికవేల రూపాయలలోపు ఆర్థిక భారం భరించలేక ఆత్మహత్యలకు పాల్పడిన వారి సంఖ్యే అధికం! అంటే పంట నష్టపోయిన రైతాంగానికి తలా పాతికవేల బ్యాంకు రుణం మంజూరు చేయించగల్గితే - వారి జీవితాలు ఇట్లా అర్థంతరంగా ఆగిపోయే ప్రమాదం ఏర్పడి వుండదన్న మాట.

ప్రభుత్వానికి, బ్యాంకులకు అది పెద్ద భారమా? పత్తి పంటవేసి నష్టపోయిన రైతుల సంఖ్య అధికంలో అధికంగా ఒక లక్షమంది వుంటారను కొంటే; ఒక్కొక్కరికి పాతికవేల ఆర్థిక సహాయం అందిస్తే అయ్యే ఖర్చు కేవలం 250 కోట్లు - మాత్రమే. దేశం మొత్తం మీద బ్యాంకులు ఇంక రావు అని వదిలేసిన పారిశ్రామిక బకాయిల మొత్తం 40వేల కోట్ల రూపాయలని అంచనా. పరిశ్రమ కోసం అన్నేసి వేల కోట్లు ఉదారంగా ఇచ్చి, సాధారణ విషయంగా మర్చిపోయే బ్యాంకులు రైతుల జీవితాలను నిలబెట్టడానికి 250 కోట్లు ఖర్చు చేయలేని స్థితిలో వున్నాయా?

రైతుల చావుకు ఏకైక కారణం - డబ్బు కొరత; అది తీరిస్తే వారు తమ బ్రతుకు పోరాటాన్ని కొనసాగించడానికి వెనుకాడరు. అది తీర్చకుండా తాత్సారం చేయడానికి కారణం డబ్బు లోపం కానేకాదు; ప్రభుత్వంలో చిత్త శుద్ధి, సీరియస్‌నెస్ లేకపోవడమే నిజమైన కారణం. క్షమించరాని విషయమిది! రైతులీ గతి పట్టడానికి కారకులు, ప్రేరకులు ఖచ్చితంగా పాలకులే. తెగుళ్లు సోకితే, పత్తి పంటను కాపాడు కోవడం కష్టమని ప్రతి వ్యవసాయాధికారికీ తెలుసు; ఏ ఏ మందులు, ఏ ఏ మోతాదుల్లో వాడితే తెగుళ్లు నివారించ వచ్చో ప్రతి వ్యవసాయ శాస్త్రవేత్తకూ తెలుసు; మార్కెట్‌లో రకరకాల నకిలీ మందులు ప్రత్యక్షమౌ తున్నాయని, అవి వాడితే రైతు మునిగిపోతాడనీ అందరికీ తెలుసు. అయినా ఎవరూ కలుగ జేసుకోలేదు. టి.వి. రేడియో వంటి సమాచార వ్యవస్థ విస్తృతంగా గ్రామస్థాయిలో వ్యాపించి వున్న ఈ రోజుల్లో రైతులకు వ్యవసాయ సూచనలు చేయడం చాలా సులువు. ప్రతి గ్రామంలో పత్రికలూ వున్నాయి. పదేళ్ల క్రితం ప్రకాశం జిల్లాలో ఇదే పరిస్థితి ఎదురైనప్పుడు తీసుకొన్న చర్యల అనుభవమూ వుంది. అన్నీ వుండీ ప్రభుత్వం పనిచేయలేదు. హైటెక్ ప్రభుత్వంగా డబ్బా వాయించుకొనే చంద్రబాబు ఇందుకు సమాధానం చెప్పి తీరాలి! చంద్రబాబు రాజీనామా చేయాలని ప్రకటన లిచ్చి తామేదో రైతులకు పెద్ద మేలు చేస్తున్నట్లు ఫోజులిస్తున్నారు బిజెపి, కాంగ్రెస్ నేతలు!

జమీన్‌రైతు

చంద్రబాబు రాజీనామా చేస్తే ఆ సీట్లో ఎగిరి గంతేసి కూర్చోవడానికి వీరికి అవకాశం వస్తుంది తప్ప, అందువల్ల రైతులకు ఏమి మేలు జరుగుతుంది?

ఈ సమయంలో, ఈ విషమ పరిస్థితిలో రైతులకు కావలసింది ఎవరు రాజీనామా చేయాలి, ఎవరు పదవిలోకి రావాలి అన్న చెత్త ప్రశ్నలు కావు; వారికి కావలసింది మనోధైర్యం కల్గించే ఓదార్పు; రేపు ఎట్లా జరుగుతుందన్న సమస్యలేని ఆర్థిక తోడ్పాటు! మొదటి కార్యం నెరవేరాలంటే ప్రభుత్వ యంత్రాంగం సమస్తం - రాజకీయ పార్టీలు, స్వచ్ఛంధ సంస్థల తోడ్పాటుతో గ్రామాలకు తరలి వెళ్లాలి. పంట నష్టపోయి, అప్పుల బాధతో చితికి పోతున్న రైతులను గుర్తించి, వారితో కొంత సమయం గడిపి, ధైర్యం చెప్పి, అవసరమైతే మానసిక వైద్య నిపుణుల సహకారం తీసుకొని, బ్రతుకు పట్ల ఆశ, సమస్యలపై పోరాటం చేసే ఆత్మ స్థైర్యం వారిలో కల్పించాలి. రెండవ ప్రక్క బ్యాంకులు, సహకార సంస్థలను రంగంలోకి దించి రైతుల ఆర్థికావసరాలు ముదింపు చేసి తిరిగి పంటవేసు కోవడానికి వనరులు సమకూర్చాలి. వ్యవసాయాధికారులను కొరడాలతో కొట్టి అయినా సరే - పొలాలలో తమ విధి నిర్వహణ చేసేటట్లు పురమాయించాలి.

ఇవేవీ పెద్ద పనులు కావు; రాజకీయవాదుల కుర్చీ పోరుకోసం ఏటా ఎన్నికలు జరిపించడానికి వెయ్యి కోట్లు వృధా చేసే ప్రభుత్వానికి ఇది పెద్ద ఆర్థిక భారం కాదు. ఇప్పటికే ఎంతో ఆలస్యం చేశారు; క్షమించరాని నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఇప్పటికైనా తమ తప్పుకు చెంపలేసుకొని, చిత్త శుద్ధితో పనిచేస్తే రైతుల ఆత్మహత్యలు ఆపడం చిటికెలో పని! రాజకీయ విబేధాలు విస్మరించి; ఒకరికొకరు నిందించుకొంటూ కాలక్షేపం చేయడం మానేసి; అన్ని పార్టీలు, అందరు నాయకులూ గ్రామాలకు తరలి వెళ్లడం చాలా అవసరం. రైతుల బ్రతుకు చితికి పోతే గ్రామీణ జీవిత విధానం కకావికలమౌతుంది; అది దేశానికే అరిష్టం. *

---

జమీన్‌రైతు

తేది: 20.2.48

వెల: 0-2-0 పేజీలు: 12

### నెల్లూరు థర్మల్ స్కీం అమలుకు ఉత్తర్వు

నెల్లూరు థర్మల్ స్కీంను వెంటనే అమలు జరపాలని ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఈ స్కీం 10 సంవత్సరాలతో పూర్తవుతుంది. సరాసరి 101 లక్షల రూపాయల ఖర్చుకాగలదని అంచనా. ప్రప్రథమంలో 7 లక్షల పదివేల రూపాయలు వ్యయం చెయ్యాలని నిర్ణయించారు. నాయుడుపేట, గూడూరు, కావలి పట్టణాల్లో సబ్ స్టేషన్లు నిర్మించడానికి, నాయుడుపేటకు నూతనంగా ఒకలైను ఏర్పాటు చెయ్యడానికి ఈ స్కీంలో అవకాశం కలిగింది. ఇది పూర్తయితే ఈ ప్రాంతంలో, వ్యవసాయికంగాను, పారిశ్రామికంగాను విద్యుచ్ఛక్తి సరఫరాకు వీలేర్పడు తుంది.

### గాంధి స్మృతి చిహ్నం

దరిద్ర నారాయణుల కోసం జీవించారు పూజ్యబాపూజీ; గాంధీజీని మించిన సోషలిస్టు ఇంకొకడు లేడు. సార్వజనీనమైన సర్వకాల యుగాను గుణ్యమైన మహాత్ముని అర్థ సిద్ధాంతాలు - శాంతి, సత్యాహింసలు మన ప్రజలకు అత్యుత్కృష్టమైన మన రాజకీయ రంగంలో ఒక పద్ధతిని, ఒక నీతిని, ఒక సక్రమ ధర్మాన్ని ఏర్పాటు చెయ్యాలి. దేశంలోని ధనిక దరిద్ర వైరుధ్యాలను మాయం చేయడం కన్న ఆయన ఆత్మకు ఇంకొక ప్రియమైన కార్యం లేదు.

అహింసా సూత్రం ప్రాతిపదికగా గల వర్గ వైషమ్య రహిత మానవ సమాజ సృష్టికి జీవిత మంతా ఆయన కృషి చేశాడు. అటువంటి సమాజాన్ని నిర్మించుకో గలగడమే ఆయనకు మనం ఏర్పరచ గలిగిన స్మృతి చిహ్నం.

నేడు నెహ్రూకు పటేలుకు మధ్య

**50 ఏళ్ల క్రితం ఈ వారం**

భేదాభిప్రాయా లున్నవా, లేవా అనేది ప్రశ్నకాదు. సోషలిస్టా, పెట్టుబడిదారా? అనేది కూడా కాదు. అందరం కలిసి జాతీయ పురోభివృద్ధికి సర్వాంగ సౌష్ఠవం కలిగిన రాజ్యాంగ నిర్మాణానికి ప్రయత్నం చెయ్యాలి.

(జమీన్‌రైతు సంపాదకీయం)

### నెల్లూరు ముచ్చట్లు

### జూబిలీ ఆసుపత్రి

"ఆడిన్ అప్పుల సర్పమాంబపై, ఆస్పత్రి [illegible]క సర్వెంట్లపై ఖాదీదారుల చిత్తవృత్తుల పయిన్, కాంగ్రెసు గోత్రాలపై మీదున్ మందుల స్టాకుపై, యువల ఆఫీసర్ల ఆర్డర్లపై వాడులే జెండెరు రోపరూక్షులము. అల్పజ్ఞానులో మాపయిన్ ప్రోదిన్

కొరవ 10 పేజీలో

---

# ఇఫ్‌కో ఎరువుల ఫ్యాక్టరీపై ఇప్పుడు అభ్యంతరాలు చెప్పడం అన్యాయం!

నెల్లూరు జిల్లాలో రేగడిచెలిక గ్రామం వద్ద 1900 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన 'ఇఫ్కో' ఎరువుల కర్మాగారాన్ని, ఇక్కడ పెట్టడం రిస్కుతో కూడుకున్న వ్యవహారమని పబ్లిక్ ఇన్వెస్టిమెంట్ బోర్డు ప్రకటించడం బాధాకరం. ఫ్యాక్టరీ పెట్టాలని భూమిని కొని రైతులకు నష్టపరిహారం కూడా చెల్లించారు. నెల్లూరు బైపాస్ రోడ్డులో పెద్ద ఆఫీసు పెట్టి, మద్రాసు నుంచి ఫ్యాక్టరీ వరకు వెళ్లిరాను హెలికాప్టర్ కావాలని టెండర్లు కూడా పిలిచారు. ఇప్పుడేమో అంతర్జాతీయంగా ఎరువుల ధరలు తగ్గి పోయినందున ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడాన్ని తప్పించాలని చూస్తున్నట్లుంది. దీన్ని కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖ ఒప్పుకోకుండా కొత్తగా నెల్లూరు, ఒంగోలు, తిరుపతి నుంచి ఎమ్మెల్యేలు వారు ఒత్తిడి తీసుకొరావాలి. అవసరమైతే ఒక ప్రజా ఉద్యమాన్ని రూపొందించాలి.

నెల్లూరు జె. పోలిరెడ్డి

### పత్తిరైతుల గూర్చి పట్టించు కోరేం?

రాష్ట్రంలో పత్తి రైతుల ఆత్మహత్యల పరంపర ఇంకా కొనసాగుతూనే వుంది. ఇప్పటి వరకు 175 మంది పత్తి రైతులు ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతూ, రైతుల గూర్చి పట్టించు కోవడమే లేదు. ప్రజల పార్టీలని చెప్పుకొనే

జనవాణి

కమ్యూనిస్టు పార్టీలు ఈ విషయంలో ఇప్పటి వరకు నోరు తెరవక పోవడం, ఒక ప్రజా ఉద్యమానికి రూపకల్పన చేయక పోవడం బాధాకరం. ఎన్నికల ప్రచార సభల్లో ప్రతి పార్టీ పత్తి రైతుల గూర్చి మాట్లాడు తున్నది. కాని ఏ నాయకుడు వారి ఆత్మహత్యలు నిలుపుదల అయ్యేలా నిర్మాణాత్మకమైన కృషిని చేయలేదనడం వాస్తవం.

నెల్లూరు సి.హెచ్. వెంకటేశ్వర్లు

### ఎన్నికల కమీషన్‌కు ఒక సూచన

ఎన్నికల కమీషన్ ఎన్నికల నిర్వహణలో పలు మార్పు, చేర్పులు చేసింది. ఈసారి నేరచరితులు పోటీ చేయకూడదని నామినేషన్ పత్రం తోపాటు పోటీ చేస్తున్న అభ్యర్థుల వద్ద ప్రత్యేక ఆఫిడవిట్ తీసుకొంది. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఖర్చు పెట్టే మొత్తం 15 లక్షలకు పెంచింది.

కొరవ 10 పేజీలో

స్వచ్ఛమైన తాజా కోడిమాంసమునకు
S.S. నాయుడు చికెన్ సెంటర్
పాత పోస్టాఫీసురోడ్డు, అనితాహాలు ప్రక్కన, నెల్లూరు
విందులకు, పెండ్లి పార్టీలకు, ఫంక్షన్లకు సరసమైన ధరలకు
కోడిమాంసం హోం డెలివరీ సదుపాయముతో సప్లయి చేయగలము.
మా స్వంత హేచరీ ద్వారా వెన్‌కాబ్ కోడిపిల్లలు అమ్మబడును.
హోల్‌సేల్ ధరలకే రీటైల్ అమ్మకం



ఘంటసాల ఆరాధనోత్సవ సభలో శ్రీమతి ఘంటసాల సావిత్రిని సత్కరిస్తున్న ఉషారాణి, ఆర్.వి. నాగరాజు

# అర్ధరాత్రి పాటలు పాడినా హాలు పట్టని జనం- ఘంటసాలకు ఘన నీరాజనం!

హైదారాబాద్‌లోని కిన్నెర ఆర్ట్ థియేటర్ సంస్థ ఘంటసాల ఆరాధనోత్సవాల పేరిట టౌన్‌హాల్‌లో వీనుల విందైన కార్యక్రమం ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన గాయనీ గాయకులు, ఘంటసాల పాడిన పాటలను - నిర్విరామంగా 24 గంటల పాటు పాడి శ్రోతలను అలరింప జేశారు. కార్యక్రమం హుషారుగా కొనసాగబట్టే నడిరేయి, తెల్లవారే సమయంలో కూడా శ్రోతల సంఖ్య ఏమాత్రం తగ్గలేదు. ఘంటసాల పురస్కారాన్ని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు అందజేసిన రోజైతే టౌన్‌హాల్ ఓపెన్ ఆడిటోరియంలో ఇసుక వేస్తే రాలని జనం. ఈసభలోనే ఘంటసాల సతీమణి శ్రీమతి సావిత్రికి అమెరికా ఆంధ్రుడు, సింహపురీయుడు కె. రవికుమార్ పాతికవేల రూపాయల పురస్కారాన్ని అందించి సత్కరించారు. సభాసామ్రాట్ కెవి. భాస్కరరావు, డాక్టర్ సి. నారాయణరెడ్డి, సినీ రచయితలు రావి కొండలరావు, వెన్నెలకంటి, సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, కలెక్టర్ సాంబశివరావు, ఎస్పీ ఈశ్వరరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఆరాధనోత్సవంలో సినీ నేపథ్య గాయకులు పిబి. శ్రీనివాస్, జి. ఆనంద్‌ల తోపాటు ఔత్సాహిక గాయకులు బిఎ. నారాయణ, వరదాచారి, రామకృష్ణ, శేషగిరిశం, ఉషాగాయత్రి, హిమబిందు, సుమనశ్రీ పాడిన పాటలకు శ్రోతల నుంచి మంచి స్పందన లభించింది. గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సలహా మేరకు ఈ కార్యక్రమం ధైర్యంగా కిన్నెర సంస్థ కార్యదర్శి మద్దాలి రఘురాం నెల్లూరులో ఏర్పాటు చేస్తే; అది విజయవంత మయ్యేందుకు ఇన్‌కంటాక్స్ అధికారి నాగరాజు, డాక్టర్ వెంకటరావు కృషి చేశారు.

## బెజవాడ గోపాలరెడ్డి ఆర్థిక పురస్కారాలు

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ఏర్పాటు చేసిన కళాకారుల సహాయనిధి నుంచి అర్హులైన 20 మందికి ఆర్థిక పురస్కారాలు అందజేయనున్నట్లు కమిటీ కార్యదర్శి బివి. నరసింహం చెప్పారు. సంగీత, సాహిత్య, కళారంగాల్లోని వారు, స్వాతంత్ర్య సమర

## నెల్లూరు సంగతులు

వీరులు తమ అర్హతలను తెలియజేసే పత్రాలను మార్చి 1తేది నాటికి బివి. నరసింహం, వంశీపెన్ కార్నర్, ట్రంకురోడ్డు, నెల్లూరు-1 చిరునామాకు పురస్కారాల ఎంపికకు పంపమని కోరుతున్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి మార్చి 9తేది టౌన్‌హాల్‌లో జరిగే గోపాలరెడ్డి ప్రథమ వర్థంతిలో వాటిని అందజేయ నున్నట్లు తెలిపారు.

## కలెక్టర్ కృతజ్ఞతలు

నెల్లూరు పార్లమెంట్ నియోజక వర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, శాంతియుతంగా జరిగేందుకు కృషి చేసిన అందరికీ జిల్లా కలెక్టర్, డాక్టర్ సాంబశివరావు కృతజ్ఞతలు చెప్పారు. ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించ బట్టే 5.4 శాతం ఓట్లు గతంలో కన్నా ఎక్కువగా పోలయ్యాయని సంతోషాన్ని వ్యక్తం చేశారు. పాపం కష్టాలన్నీ ఉదయగిరికి రిటర్నింగ్ అధికారిగా వెళ్లిన జాయింట్ కలెక్టర్ నాగేశ్వరరావుకు వచ్చిపడ్డాయి. రిగ్గింగ్‌ను ఆపలేక పోయారన్న అపప్రథను, తెచ్చుకొన్నా రాయన.

## కుటుంబ నియంత్రణకు అదనపు పారితోషికం

నెల్లూరులోని జూబ్లీ ఆసుపత్రిలో ఫిబ్రవరి 28తేది వరకు ప్రత్యేక కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఆపరేషన్ చేయించుకొన్న వారికి ప్రభుత్వం ఇచ్చే 120 రూపాయల పారితోషికానికి అదనంగా నెల్లూరు ప్రగతి మహిళా మ్యూచ్యువల్ ఎయిడెడ్ కన్స్యూమర్స్ కోఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ వారు అదనంగా ఒక స్టీలుబిందె ఇస్తారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. మోహనరావు తెలియజేస్తున్నారు.

## తెలుగుదేశం నాయకులు దిగజారారు!

అధికారం చేజిక్కించు కోవాలన్న తపనతో తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు పార్లమెంట్

తరువాయి 11 పేజీలో

# కార్యకర్తల కృషిలోపమే ఓటర్ల నిరాసక్తత కు కారణం!

నెల్లూరు టౌన్ ఓటర్లు పార్లమెంటు ఎన్నికల్లో ఓటేసేందుకు పెద్దగా ఉత్సాహం చూపించలేదు. ఏ పోలింగ్ కేంద్రంలోనూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్ల క్యూలు కానరాలేదు. మెజార్టీ పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల వరకు పోలింగ్ ప్రారంభమే కాలేదు. కనీసం పది మంది కూడా ఓటు వేయలేదు. పది గంటలు దాటాక జెండావీధి, కోటమిట్ట, సంతపేట, వెంకటేశ్వరపురం, వెంగళరావు నగర్,

**నెల్లూరు టౌన్‌లో సగం మందికి మించి ఓటు వేయలేదు; ఒక్క పోలింగ్ కేంద్రంలోనూ క్యూ కన్పడ లేదు!**

కొత్తూరు, ఎన్టీఆర్ నగర్ పోలింగ్ కేంద్రాల వద్ద కొందరు ఓటర్లు క్యూలలో నిలబడి కనిపించారు. ఒక్క రొక్కరు రావడం, ఓటేసి వెళ్లి పోవడం చాలాచోట్ల కనిపించింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లోని సిబ్బంది ఈగలు తోలుకొంటూ కూర్చొన్నారనాలి. ఈ సమయంలో అత్యల్పంగా ఓట్లు పోలయ్యాయి. 3-5 గంటల మధ్య 10 శాతం ఓటింగ్ జరిగింది. టౌన్‌లోని కొత్తూరు, ఎన్టీఆర్ నగర్, కోటమిట్ట, సంతపేట, వెంగళరావు నగర్, వెంకటేశ్వరపురం, బాలాజీనగర్ ప్రాంతాల్లో సిపిఎం కార్యకర్తలు; నవాబుపేట, ఎసి నగర్, మైపాడు గేట్, స్టోన్‌హౌస్‌పేట ప్రాంతాల్లో బిజెపి కార్యకర్తలు తాముదొంగ ఓట్లు పెద్దగా వేసుకొన్నామని చెప్పు కొంటున్నారు. మూడు పార్టీల కార్యకర్తలూ ఓటర్లను పోలింగ్‌కు తరలించడం, స్లిప్స్ పంచడం, ఇల్లిల్లూ తిరిగి ఓటు అడగడం వంటి ఎన్నికల కృషి చేయక పోవడమే పోలింగ్ తగ్గి పోవడానికి కారణమను కోవాలి. జెండావీధి, ఎన్టీఆర్ నగర్‌లో చిన్నగొడవలు మినహా టౌనంతా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది.

## ఎన్నికల ఖర్చులో సిపిఎం ఫస్ట్!

లోక్‌సభ ఎన్నికలకు వివిధ పార్టీల అభ్యర్థులు అధికారులకు సమర్పించిన ఖర్చు లెక్కల్లో పట్టీలో సిపిఎం మొదటి స్థానంలో నిలిచింది. ఆపార్టీ అభ్యర్థి శ్రీమతి స్వర్ణలత 7,47,768 రూపాయలు ఖర్చు పెట్టినట్లు లెక్కచూపిస్తే; బిజెపి అభ్యర్థి బాలకొండయ్య 6,24,429 రూపాయలు ఖర్చు పెట్టినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీమతి పనబాక లక్ష్మి 1,91, 452 రూపాయల్లో ఖర్చు లెక్క తేల్చేస్తే, బిఎస్పీ అభ్యర్థి 94వేల 75 రూపాయలు; సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి అరుంధతి 33,998; మరో అభ్యర్థి ఎం.వేణుమాధవ్ 69,445 రూపాయలకు లెక్కలు సమర్పించారు. సిహెచ్. రామయ్య, ఎం. లక్ష్మయ్య అనే ఇండిపెండెంట్లు లెక్కలు సమర్పించలేదని కలెక్టర్ షోకాజ్ నోటీసు లిచ్చారు.

## శ్రీకృష్ణ దేవరాయ జయంతి సభ

నెల్లూరు వర్ధమాన సమాజం 21తేది టౌన్‌హాల్‌లో శ్రీకృష్ణ దేవరాయ జయంతి సభను జరుపుతుంది. డాక్టర్ ఉడాలి నరసింహ శాస్త్రి అధ్యక్షత వహించే సభలో రాజమండ్రి గౌతమీ విద్యాపీఠం రీడర్ డాక్టర్ ప్రభల సుబ్రహ్మణ్య శర్మ వక్తగా పాల్గొంటారు. సభా పోషకులు పునూరు పోలారెడ్డి, తన తండ్రి ఆదిరెడ్డి స్మృత్యంకంగా వక్తను సన్మానిస్తారు. *



శ్రీ రామకృష్ణ పరమహంస జయంతి సభలో డాక్టర్ కె. నరశింహా రెడ్డిని సత్కరిస్తున్న యం. ధర్మారెడ్డి, పొన్నాల రామసుబ్బా రెడ్డి, పాకాల వెంకట కృష్ణయ్య

# కవిత్రయ జయంతుల్లో కవిత్రయం ప్రస్తావన లేకపోవడం తప్పు!

వర్ధమాన సమాజం, కవిత్రయ జయంతి సంఘం సంయుక్త యాజమాన్యంలో నన్నయ - ఎర్రన - తిక్కనల జయంతులు వరుసగా 14,15, 16 తేదుల్లో పురమందిరంలో జరిగాయి.

తొలినాడు నన్నయ జయంతి; అధ్యక్షత శ్రీమతి మోహర్మణి; ఉపన్యాసకురాలు - ఎవరో శ్రీమతి పి. సుధ అట; తిక్కకు మిక్కిలిగా నవలలూ, కథలు వ్రాసినట్లు బివి. నరసింహం పరిచయ వాక్యాల పచరింపు; కాని, ఆ నవలలు కాని, కథలుగాని మనబోటి వాళ్ల స్థాయికి

### సాహిత్య సమాచారం

మించినవి. అందువల్ల మనకు అందు బాటులో లేనివి కూడా! పరిచయ కర్త మాటల్లో కనబరచిన ఘనత ఆమె పలుకుల్లో కనబడలేదు. 'నవలా సాహిత్యా'న్ని సమీక్షిస్తుందని కరపత్రంలో వేశారు; విషయం సముద్రమంత విశాలమైనది, లోతైనది కూడా. ఈత చేతగాక పిల్ల పాపం - ఆమె - తాను 'అశక్తురాలను' అని మొదటే ఒప్పేసుకొంది. తప్పు ఆమెది కాదు - నెల్లూరు రసజ్ఞులను ఏమార్చాలను కొని, ఆమెను అమలాపురం నుంచి తీసుకొని

తరువాయి 11 పేజీలో

# ఓటర్ల తీర్పు స్పష్టం - సందేహాలు వ్యర్థం!

## నెల్లూరులో కాంగ్రెస్ గెలవడమే కాదు, మెజారిటీ సైతం గతం కంటే జాస్తిగా వుంటుంది!

నెల్లూరు లోక్ సభ నియోజక వర్గం ఎన్నిక ఫలితంపై అపరిమిత చర్చ జరుగుతూంది. పోలింగ్‌కి, కౌంటింగ్‌కి రెండు వారాల ఎడం వుండడంతో ఎవరు గెలుస్తారనే ప్రశ్న పెద్ద ఉబుసుపోక చర్చగా మారిపోయింది. ఏమీ పాలుపోని వారంతా దీని గురించే మాట్లాడు కొంటున్నారు; పందాలు కట్టుకుంటున్నారు; పంతాలు పెంచు కొంటున్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క వితండ వాదంతో, వూహాగానంతో లెక్కలు చెప్తుంటే వినేవారికి మతిపోతున్నది. అభ్యర్థులది మరీ జాలిగొల్పే పరిస్థితి. ఒకరొచ్చి నువ్వే, గెల్చిపోయావు పొమ్మని ధైర్యం చెప్తే; ఇంకొకరొచ్చి నీ పని ఖాళీ అని ప్రకటించి వున్నసత్తువ ఉడిగి పోయేట్లు చేస్తున్నారు.

విచిత్రం ఏమిటంటే - అభ్యర్థులు ముగ్గురూ గెలుపు తమ దేనన్న ధీమాతో వుండడం! వారి మనసుల్లో ఏదైనా గుబులు వుందోలేదో మనకైతే తెలియదు కాని - పైకి మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. రాజకీయ వాదులకు రెండు వారాలపాటు మన స్తిమితం లేకుండా చేసిన నెల్లూరు ఓటరును అభినందించి తీరాలి.

అయితే - ఓటరు తీర్పులో ఇంతటి అస్పష్టత వుందా అన్నదే ప్రశ్న. మా మటుకు మాకు ఆ సందేహం రావడం లేదు. నెల్లూరు ఓటరు చాలా స్పష్టంగా, తేటతెల్లగా తన తీర్పు ప్రకటించాడనే అనిపిస్తున్నది. బ్యాలెట్ పెట్టెలు తెరవక మునుపే ఫలితం కళ్లకు కట్టినట్లు కన్పిస్తున్నదని చెప్పడానికి మేము సంకోచించడం లేదు. అందుకు ఆధారం - పోలింగ్‌కు ముందు వుండిన రాజకీయ వాతావరణానికి, పోలింగ్ రోజు పరిస్థితికి ఏమాత్రం తేడా కన్పించక పోవడం. నెల్లూరు లోక్‌సభ సభ్యురాలిగా కాంగ్రెస్ అభ్యర్థిని శ్రీమతి పనబాక లక్ష్మి విజయం సాధించారని చెప్పడానికి ఎటువంటి సందేహం అవసరం లేదన్నదే మా భావన.

కాని ఇటు సిపిఎం, అటు బిజెపి అభ్యర్థుల గెలుపుపట్ల ఆయా పార్టీ నేతల అభిప్రాయాలు వేరుగా వున్నాయి. ఐదు శాఖల మంత్రి శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి చాలా నిఖార్సుగా సిపిఎం గెల్చిపోయిందని ప్రచారం చేస్తున్నారు; అసత్య ప్రచారాలను నికరమైన నిజంగా నమ్మించడంలో చంద్రమోహనరెడ్డిని మించిన రాజకీయవాది ఈ జిల్లాలో మరొకరు లేరని ఘంటా పథంగా చెప్పవచ్చు. ఆ విద్య ఆయన ఒక్కడికే స్వంతం. సిపిఎం ఎమ్మెల్యే జక్కా వెంకయ్య గారు కూడా తాము గెల్చినట్లే చెప్తున్నారు. అంతా పథకం ప్రకారమే జరిగింది, గెలుపు మనదేనని తన కార్యకర్తలకు చెప్పారాయన. అయితే వీరిద్దరిదీ - ఆశావాదమే తప్ప, ఆధారాలుండి చెప్పే మాటకాదు.

## బిజెపి అభ్యర్థి విజయం కేవలం భ్రమ

బిజెపి వాళ్లయితే విజయోత్సవానికి పూలమాలలు, ఔట్లు ఎన్నెన్ని ఆర్డరివ్వాలో ఆలోచించు కొంటున్నారు. గాలిలో గంతులేయడ మంటే ఇదే! 30వేలతో బయట పడ్డామని ఒక నేత అంటే, కాదు మన మెజారిటీ లక్ష దాటినా వింత లేదని మరొకరు లెక్కవేసి మరీ చూపిస్తున్నారు.



ఈ రెండు వారల పాటు వారు అరచేతిలో స్వర్గ దర్శనం చేసినంత మాత్రాన ఎవరికొచ్చిన నష్టమూ ఏదీ లేదు. కాని మరీ అంత భ్రమల్లో పడితే కౌంటింగ్ దగ్గర ఆశాభంగంతో కుప్ప కూలిపోతారేమో నన్నదే సందేహించాల్సిన విషయం.

**బ్యాలెట్ పెట్టెలో దాగిన మర్మం సిపిఎం స్థానం ఏమిటన్నదే!**

మా అంచనాలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం కావడమే కాదు - గతం కంటే మెజారిటీ మించి పోవచ్చు! 1996 ఎన్నికల్లో లక్ష్మి 68వేల 185 ఓట్ల తేడాతో గెల్చింది. అప్పటికి, ఇప్పటికి రాజకీయాలలో వచ్చిన ప్రధాన మార్పులు - కాంగ్రెస్‌లోనికి సోనియా ప్రవేశం; చంద్రబాబుపైన వ్యతిరేకత పెరగడం; బిజెపి బలపడడం! ఇవన్నీ కాంగ్రెస్ విజయావకాశాలు పెంచేవే తప్ప, తగ్గించేవి కావు. ఆ ఎన్నికల్లో లక్ష్మికి 2,69,498 ఓట్లు పడ్డాయి. వాటిలో నుంచి బిజెపికి 10 శాతం ఓట్లు తరలివెళ్లి పోయాయనుకొన్నా - సిపిఎం నుంచి ముస్లిం, క్రైస్తవుల ఓట్లు తరలి వచ్చి ఆ లోటు పూడ్చేసినట్లు లెక్క. బిజెపికి గతంలో వచ్చింది 83585 ఓట్లు; ఒక లక్ష ఓట్లు సిపిఎం నుంచి వచ్చి వారికి [illegible]మను కున్నా - లక్ష్మి దరిదాపులకు సైతం రాలేదు బాల కొండయ్య. చంద్రబాబు వ్యతిరేకతతో, బిజెపి పట్ల కొత్త వ్యామోహంతో తమ నుంచి వలస వెళ్లి పోయేవి తప్ప, లోపలికి వచ్చే ఓట్లు లేవు సిపిఎంకి! ఈ కోణం నుంచి పరిశీలిస్తే లక్ష్మి గెలుపు ఖాయం.

పోలింగ్ రోజు ఓటరు తీరు నిశితంగా పరిశీలిస్తే - కాంగ్రెస్‌కు అనుకున్న దానికంటే అదనపు ఓట్లు పడ్డాయనీ అర్థమౌ తున్నది. అందువల్ల లక్ష్మికి గతంలో కంటే అధిక మెజారిటీ వచ్చే అవకాశం కన్పిస్తూంది!

తొరువ 12వ పేజీలో

### పెరిగిన పోలింగ్ ఎవరికి ముప్పో!

16తేది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంటరీ నియోజక వర్గం మొత్తం మీద 7,53,876 మంది ఓటర్లు (64.6%) తమ ఓటు హక్కు వినియోగించు కొన్నారు. రికార్డు స్థాయి పోలింగ్ ఇది. మొత్తం ఓటర్ల సంఖ్య 11,66,187; 1996లో మొత్తం ఓటర్ల సంఖ్య 11,82,765; అప్పుడు పోలైన ఓటు 7,00,857; అంటే గతం కంటే ఓటర్ల జాబితాలో 16వేల 578 మంది తగినా, పోలింగ్‌లో మాత్రం 53వేల మంది అదనంగా పాల్గొన్నారు. ఓటర్లలో ఇంత ఆసక్తి ఎందువల్ల కల్గిందో, అది ఎవరికి ముప్పో బ్యాలెట్ పెట్టెలు లెక్క పెడితే తప్ప తెలియదు. అసెంబ్లీ స్థానాల వారీగా చూస్తే అల్లూరులో 92,358 మంది (67.5%), కోవూరులో 96,566 మంది (66.4%), ఆత్మకూరులో 1,03,545 మంది (65.3%), రాపూరులో 1,11,667 మంది (67%), నెల్లూరులో 1,25,668 (54.3%), గూడూరులో 1,13,276 (68.2%) మంది ఓట్లు వేశారు. సర్వేపల్లి నియోజక వర్గంలో అత్యధికంగా 1,10,796 (68.6%) మంది ఓటు వేశారు. గత పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ శాతం 59.2% మాత్రమే! ఈసారి మరో 5శాతం మంది ఎక్కువగా పోలింగ్ కేంద్రాలకు వచ్చారు.

# ఓడించాలని చూసినవారే వెల్లిపడ బోతున్నారు!

పద్మవ్యూహంలో అభిమన్యుడి వలె తిరుపతి ఎన్నికల రణరంగంలో చిక్కుక పోయిన కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చింతామోహన్ చావు తప్పించుకొని బయటపడినట్లే కన్పిస్తూంది. నియోజక వర్గం మొత్తం మీద తనను గెల్పించడానికి శ్రమించిన వారికంటే, ఓడించడానికి చెమటోడ్చిన వారి సంఖ్య అధికమై నప్పటికీ - ఓటర్లలోని కాంగ్రెస్ అనుకూలత ఆసరాతో గట్టు ఎక్కగలిగాడా అన్న అభిప్రాయం ఏర్పడుతున్నది.

సాధారణ పరిస్థితులలో అయితే తిరుపతిలో కాంగ్రెస్ విజయం సునాయాసంగా వుండి వుండాలి. గత ఎన్నికల్లోనే చంద్రబాబు అరిచి గీపెట్టినా కాంగ్రెస్ గెలుపు సల్లిరుపై బండిపలె కదలిపోయింది. ఆ పరిస్థితుల్లో, ఇప్పుడు చంద్రబాబు పట్ల జనంలో వ్యతిరేకత రెట్టింపైన దశలో, సోనియా సమ్మోహనాస్త్రం జనం మనసులను వశం చేసుకొని వున్న వాతావరణంలో కాంగ్రెస్ గెలుస్తుందా, ఓడుతుందా అన్న మీమాంస వుండనే వుండకూడదు. కాని అసలు అభ్యర్థి నెలవల సుబ్రహ్మణ్యాన్ని చివరి క్షణంలో ప్రక్కకు తోసేసి, కాకి నోటిలోని మాంసం ముక్కను చేజిక్కించుకొన్న నక్కవలె కొసరు అభ్యర్థిగా చింతా మోహన్ రంగ ప్రవేశం చేయడంతో కాంగ్రెస్ వాదులు హతాశులై పోయారు. ఆ విపరిణామ ప్రభావం పోలింగ్ వరకు చింతామోహన్‌కు చెమటలు పట్టించింది. అప్పటికీ తనకబ్బిన గజకర్ణ గోకర్ణ టక్కుటమార మహా మంత్ర తంత్రాది విద్యలన్నిటినీ వరుసబెట్టి ప్రదర్శించాడు చింతా మోహన్. ఆ కొద్ది సమయంలోనే కొండను పిండి చేసేశాడు. అయితే పాత ఎమ్మె[ల్యే] సుబ్రహ్మణ్యం, చదలవాడ కృష్ణమూర్తి, చెలికం శంకరరెడ్డి ఇత్యాది కాంగ్రెస్ వాదుల దగ్గర ఆయన మంత్రాలు పారలేదు. వారందరూ ఆయన ఓటమికి కంకణం కట్టుకొని పోరాడారు. మామూలు స్థితిలో అయితే వీరందరి కృషి చింతా మోహన్ విజయావకాశాలను మసి చేసి వుండాలి. తెలుగుదేశం అభ్యర్థి డాక్టర్ శివప్రసాద్ ఆయాసం లేకుండా ఎమ్పీ అయిపోయి వుండాలి.

కాని పోలింగ్ తీరు చూస్తే ఆ వాతావరణం కన్పించడం లేదు. కాంగ్రెస్ వాదుల ఓటమి ప్రయత్నం కంటే మిన్నగా తిరుపతి నియోజక వర్గంలో కాంగ్రెస్ అనుకూల గాలులు వీచాయన్పిస్తూంది. ఏజంటు లేకుండా చేయడం, కార్యకర్తల కరవు ఏర్పర్చడం వంటి వాటిలో వారి ప్రయత్నాలు ఫలించిన మాట నిజమే కాని, ఓటరు మనసు మార్చడంలో మాత్రం అవి నిష్ఫలమైనాయనే అభిప్రాయం కల్గుతూంది. ఒక్క వెంకటగిరిలో మాత్రం చింతా మోహన్‌కు దిమ్మతిరిగింది. ఒక్క కాంగ్రెస్ వాడి కూడా ఆయన ప్రక్కన నిలబడడానికి ముందుకు రాలేదు. అపూర్వమైన సమైక్యతతో అభ్యర్థిని ఒంటరి వాణ్ని చేసేశారు; అనాథగా మిగిల్చారు. వెంకటగిరి కాంగ్రెస్ వాదుల ఆవేదన, ఆగ్రహం అర్థం చేసుకోదగినవే!

**ఎందరెన్ని ఆటంకాలు కల్పించినా తిరుపతిలో చింతా మోహన్ క్షేమంగా గట్టెక్కాడనే అభిప్రాయం కల్గుతూంది - ఓటింగ్ సరళి పరిశీలిస్తే!**

1994 అసెంబ్లీ ఎన్నికలలో, ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో చింతామోహన్ ప్రవర్తన తీరు చాలా గర్హనీయంగా వుండింది. పబ్లిక్‌గా, పచ్చిగా కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి డబ్బు పంచారాయన; తనకు చేతనైన రాయినల్లా విసిరాడు. ఆ విద్రోహ వైఖరి ఇప్పుడు తనకే ఎదురు తిరిగింది; చేసుకొన్న వారికి చేసుకొన్నంత మహదేవ అని పెద్దలు ఎప్పుడో చెప్పారు కదా! అప్పటికీ నేదురుమల్లి జనార్ధనరెడ్డి తన అనుచరులందరినీ దండం పెట్టి మరీ బ్రతిమలాడారు; మనసులో కష్టం వున్నా పార్టీకి ద్రోహం చేయవద్దని ఎంత నచ్చ చెప్పినా అనుచరులు విన్పించు కోలేదు. చింతామోహన్‌కు ఆ సంగతి తెలును. తెలిసీ పోలింగ్ ముగిసిన ప్రక్క క్షణం జనార్ధనరెడ్డిపైన తన అక్కసునంతా వెళ్లగక్కుతూ పత్రికా ప్రకటన చేశాడు. పివి. నరసింహారావుకు పట్టిన గతి జనార్ధనరెడ్డికి పడుతుందని శాపనార్థాలు పెట్టాడు.



చింతామోహన్‌ను నమ్మలేమని వెంకటగిరీయులు జనార్ధనరెడ్డి మాట ధిక్కరించడానికి కారణమదే! జనార్ధనరెడ్డే గనుక ఆయనకు ద్రోహం చేయాలనే నిర్ణయం తీసుకొని వుంటే - సూళ్లూరుపేట, శ్రీకాళహస్తిల లోనూ వెంకటగిరి పరిస్థితే ఎదురై వుండేది. ఈ రెండు చోట్ల కూడా చింతామోహన్‌కు స్వంత మనిషి అన్నవాడు లేడు. వుండేదంతా జనార్ధనరెడ్డి అనుచర బృందమే. వారు ఎదురు తిరిగివుంటే సోదిలో కూడా కన్పించి వుండేవాడు కాడు. తిరుపతి, సత్యవేడు, నగరిలలోనూ సమస్యలు

తొరువ 7వ పేజీలో

# అన్న, వదినల కంటే అధిక ఆధిక్యత వస్తుంది శీనయ్యకి!

## నెల్లూరు నలుచెరగుల్లో

[illegible]

### సమస్యల్లో పడిన ఒంగోలు కలెక్టర్

ఉదయగిరి, కొండపిలలో ఎన్నికల పర్యవేక్షణలో విఫలమైనందుకు ఒంగోలు కలెక్టర్ దాసరి శ్రీనివాసులును ఎన్నికల కమీషన్ తప్పు పట్టింది. కొండపి ఎమ్మార్వో కార్యాలయంలో వేల సంఖ్యలో బ్యాలెట్ పత్రాలు కన్పడడం; వాటిని తగల బెట్టినట్లు గుర్తులు దొరకడం; ఉదయగిరిలో రాజమోహన్‌రెడ్డి పబ్లిక్‌గా రిగ్గింగ్ చేసినా చర్య తీసుకోక పోవడం వంటి అంశాలపై కలెక్టర్‌ను నిలదీశారు ఎన్నికల కమీషన్ అధికారులు. రాజమోహన్‌రెడ్డి ఒక బూత్‌లో రిగ్గింగ్ చేస్తుండగా తీసిన వీడియో క్యాసెట్; గొడ్డలి పట్టుకున్న అనుచరుడితో మరొక బూతు ముందు నిలబడి వుండిన ఫోటో వారికి లభించాయట. దీనితో మొత్తం ఉదయగిరి, కొండపి నియోజక వర్గంలో రీపోలింగ్ నిర్వహించాలనే డిమాండ్ ఒకటి వచ్చింది. వీటిపై విచారణకు ఢిల్లీ నుంచి ప్రత్యేక అధికారులు వస్తున్నారు. వారి నిర్ణయంపై ఆధారపడి వుంటుంది రీపోలింగ్. ఈ పరిణామాలతో కలెక్టర్ సమస్యల్లో పడిపోయాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్టల్లా చేశారాయన. అదిప్పుడు గొంతు పట్టుకున్నది.

ఉదయగిరి మొత్తం రీపోలింగ్ జరపకపోయినా ఆరు గ్రామాలలోమాత్రం జరిపించ వచ్చునని అంచనా. కొండపిలో దొరికినవి వాడగా మిగిలిన బ్యాలెట్ పత్రాలని తేలినప్పటికీ, వాటిని అంత నిర్లక్ష్యంగా పారేసినందుకు సంజాయిషీ ఇచ్చు కోవలసి వుంటుంది. ఈ పత్రాలు వెలుగు చూడడంతో ప్రజలలో పలు రకాల అనుమానాలు కలుగుతున్నాయి. వాటన్నిటినీ నివృత్తి చేయడం ఎన్నికల కమీషన్ బాధ్యత.

### బాపట్లలో విజయం ఖాయం

బాపట్ల నియోజక వర్గంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్. జనార్ధనరెడ్డి గెల్చిపోయినట్లే లెక్క. తెలుగుదేశం పట్ల సర్వత్రా వ్యక్తమైన వైముఖ్యంతో పాటు, ఆపార్టీ అభ్యర్థి, కేంద్ర మంత్రి డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పట్ల కూడా ప్రజలలో వ్యతిరేకత వెల్లుబకడంతో జనార్ధనరెడ్డి విజయం ఖాయమై పోయింది. మార్టూరులో దేశం నేతలు రిగ్గింగ్ చేశారనే సందేహం ఒకటి వున్నప్పటికీ ఆయన గెలుపు పట్ల శంకమాత్రం లేదు. మెజారిటీ సైతం లక్షా 50 వేల ప్రాంతంలో వుండ వచ్చునని అంచనా.

### డిసిసి అధ్యక్షుడి సవాల్

సర్వేపల్లిలో కాంగ్రెస్‌కు మెజారిటీ రాకుంటే తాను రాజకీయ సన్యాసం స్వీకరిస్తానని; వస్త్ర మంత్రి చంద్రమోహన్‌రెడ్డి అందుకు సిద్ధపడాలని సవాల్ విసిరారు డిసిసి అధ్యక్షుడు సివి. శేషారెడ్డి. మంత్రి నుంచి ఇంకా సమాధానం రాలేదు. ఇక రాబోదు కూడా!

### సుప్రీంకోర్టులో మళ్లీ జిప

నెల్లూరు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎన్. నాగభూషణమ్మ పట్టు వదలని విక్రమార్కురాలి వలె పోరాడుతున్నది. తనని అవిశ్వాసం పెట్టి దించడం న్యాయవిరుద్ధమని సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశారామె. అదిప్పుడు విచారణకు వచ్చింది.

టీచర్ల బదిలీలలో దండుకున్న డబ్బులన్నీ కోర్టులకు, లాయర్లకు ఖర్చు పెట్టేస్తే ఇంక మిగిలేదేముందండీ నాగభూషణమ్మ గారూ!

### సూళ్లూరుపేట ప్రేలుడుపై శంక

గత వారంలో సూళ్లూరుపేటలోని ఒక ఇంటిలో బాంబు సంచా తయారు చేస్తుండగా మందు సామగ్రి ప్రేలి నలుగురు మృతి చెందిన సంఘటనపై పలు సందేహాలు తలెత్తుతున్నాయి. కోయంబత్తూరు బాంబు ప్రేలుళ్ల నేపధ్యంలో దీనిపై విచారణ ప్రారంభించారు. 18,19 తేదులలో బాంబుల నిపుణులు వచ్చి, సంఘటనా స్థలం సందర్శించి, ప్రేలుడు సామగ్రి శాంపిల్స్ తీసుకవెళ్లారు.

### షార్ హంతకుడికి శిక్ష తగ్గింపు

శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో తల్లీ, పిల్లలను కిరాతకంగా చంపిన బొడ్డు వెంకటరెడ్డి అనే హంతకుడికి నెల్లూరు జిల్లా కోర్టులో విధించిన ఉరిశిక్షను తగ్గించి, యావజ్జీవ శిక్షగా మార్పు చేసింది హైకోర్టు.

తరువ 7వ పేజీలో

ఒంగోలులో తెలుగుదేశం అభ్యర్థి శ్రీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రయత్నం మరొకసారి విఫలమైందనే భావించాలి. ఎంత విశృంఖలంగా రిగ్గింగ్ చేసినా ఓటర్ల తీర్పును తారుమారు చేసే శక్తి ఆయనకు కల్గలేదు. గత రెండు పర్యాయాల కంటే, తన అన్న, వదినలకు వచ్చిన మెజారిటీ కంటే అధిక ఓట్లతో ఒంగోలు ఎమ్పీగా శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గెల్చిపోయాడని ప్రకటించ వచ్చు.

గెలుపు, ఓటముల సంగతి ప్రక్కన పెట్టి, ఇక్కడ ఎలక్షన్ జరిగిన తీరు చూస్తే మాత్రం ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం వుండే వారెవరికైనా మనసు కలుక్కు మంటుంది. ఈ ఇద్దరు అభ్యర్థులూ ఎన్నికల వ్యవస్థతో పరాచకాలాడారు. ఎన్నికల నిబంధనలను, ప్రజాస్వామ్య సూత్రాలను, విలువలను గడ్డి పరకల క్రింద తీసిపారేశారు. అదెక్కడి డబ్బు? అదెక్కడి విచ్చలవిడి? చెరో-మూడు కోట్లకు పైగా వ్యయమై వుంటుందని అంచనా; చిల్ల పెంకుల వలె వెదజల్లారు. పత్రికా విలేఖరుల నుంచి పోలీసుల దాకా; పోలింగ్ సిబ్బంది నుంచి ఓట్ల స్లిప్పులు వ్రాసే కార్యకర్తల దాకా అందరికీ విలువకట్టి, విక్రయం చేశారు. చివరి రెండు రోజులైతే ప్రతి గ్రామం ఒక సారా కేంద్రంగా మారిపోయింది. లక్షల సంఖ్యలో చీప్ లిక్కర్ సీసాలు వెదజల్ల బడ్డాయి. పోలింగ్ రోజు గ్రామాలలో తిరుగుతూ వుంటే రోడ్డు పొడవునా తాగి తూలుతూ వెళ్లే ఓటర్లే.

తెలుగుదేశం పార్టీ ఈ స్థానం పట్ల ఎన్ని ఆశలు పెంచుకొని వుండిందో వర్ణించడం కష్టం ఎట్లయినా, ఏమి చేసైనా గెల్చి తీరాలని ప్రయత్నించాడు రాజమోహన్‌రెడ్డి; అందుకే అంత డబ్బు వెదజల్లాడు. ముఖ్యమంత్రి సైతం అంతే పట్టుదలతో అందరిచేతా పని చేయించాడు. కాని వారి దురదృష్టం - జనంలో చంద్రబాబు పట్ల వ్యతిరేకత తతిమా స్థానాలలో కంటే జాస్తిగా కన్పించింది ఇక్కడ. ఎక్కువగా రైతులు వుండే ప్రాంతం; మెట్ట ప్రాంతం కావడంతో కరెంట్‌తో పడే బాధలు; పత్తి రైతుల ఆత్మహత్యల వార్తలు వారిలో తెలుగుదేశం పట్ల వైముఖ్యం పెంచాయి. దాని ప్రభావం ఎన్నికల ఫలితాలపై బాగా కన్పించింది.

గత ఎన్నికలలోనే ఒక్క ఉదయగిరిలో తప్ప తతిమా అన్ని స్థానాలలో కాంగ్రెస్‌కు మెజారిటీ లభించింది; అప్పటికి ఇప్పటికి తెలుగుదేశం బలహీన పడింది తప్ప బలపడలేదు.

ఉదయగిరిలో గతంలో వలె ఈసారి విపరీతంగా రిగ్గింగ్ జరిపించాడు రాజమోహన్‌రెడ్డి; కొన్ని బూతులలో తానే బ్యాలెట్ పత్రాలు పెరుక్కొని మరీ గుద్దాడు. ఎమ్మెల్యే విజయరామిరెడ్డి హైతే శివమెక్కిందా అన్న సందేహం కల్గింది. గొడ్డళ్లు, కత్తులు, బాంబులు పట్టుకుని తిరిగారాయన. కడప, కర్నూలుల వలె ఉదయగిరిని రాక్షస సీమగా మార్చేయ వచ్చుని భావించినట్టున్నారు. ఉదయగిరిలో తమకు 25వేల మెజారిటీ వస్తుందనే భ్రమలో వున్నారు వారు. కాని ఓటర్లు తమకొంతటి గుణపాఠం నేర్పిందీ బ్యాలెట్ పెట్టెలు తెరిచిన తర్వాత కాని వారికి అర్థంకాదు. కాంగ్రెస్ ఎంత వెనుకబడినా 4 లేదా 5వేల లోపు మాత్రమే వుంటుంది తేడా; రెండు పార్టీలూ చెరి సమానమైనా ఆశ్చర్యం లేదు.

కావలిలో కలికి యానాదిరెడ్డి గారు ఆలస్యంగా రంగ ప్రవేశం చేసినా మెజారిటీ సాధనలో వెనుకబడలేదు. గత పర్యాయం 14వేలా 179 ఓట్ల మెజారిటీ వచ్చింది; ఈసారి అది 25వేల వరకు ఎగబ్రాకుతుంది. తెలుగుదేశం నేతలు వంటేరు వేణుగోపాలరెడ్డి, కొండపనాయుడుల మధ్య ఒద్దిక కుదిర్చినట్లు ప్రచారం చేశారు. పోలింగ్ రోజు ఆ వాతావరణమే కన్పడలేదు. ఒకరి మీద కోపంతో ఒకరు నిరాసక్తత ప్రదర్శించి, కాంగ్రెస్ ఆధిక్యత పెంచారు.

> ఉదయగిరిలోనూ భయపడినంత లోటురాదు; తెలుగు నేతలకు దిమ్మ తిరిగే ఫలితం కన్పించవచ్చు కావలిలో ఒద్దిక కుదరలేదు!

ఒంగోలు టౌన్‌లో ఎమ్మెల్యే ఈదర హరిబాబు కిరాయి గూండాలు తెల్లముఖం వేసేశారు. మెజారిటీ తేలేకున్నా సమం చేసి చూపిస్తానని చంద్రబాబు దగ్గర ప్రగల్భాలు పలికాడు హరిబాబు. కాని పోలింగ్ సమయానికి ఎట్లా పోయాడో అడ్రసే లేదు. గతంలో వలె పాతికవేల మెజారిటీ వస్తుందిక్కడ కాంగ్రెస్‌కి!



సంతనూతలపాడులో కరణం బలరాం బలప్రయోగ మంత్రాలూ పారలేదు. జనంలో స్పందన కన్పించక పోవడంతో పిల్లివలె చల్లగా జారుకున్నా డాయన. సరైన నాయకత్వం లేకపోయి నప్పటికీ కాంగ్రెస్ మంచి ఆధిక్యత సాధించింది. కనిగిరి, కందుకూరు, కొండపిల పరిస్థితి అంతే. కాంగ్రెస్ తప్ప తెలుగుదేశం కన్పడనే లేదు.

మొత్తం మీద పరిస్థితి చూస్తే శ్రీనివాసులురెడ్డి విజయం లక్ష ఓట్ల మెజారిటీతో వుండ వచ్చు. *


## బస్ అమ్మబడును

1988 మోడల్ అశోక్ లేల్యాండ్ బస్ మంచి రన్నింగ్ కండీషన్‌లో వున్నది అమ్మబడును. వివరములకు

**R.K.T. సర్వీస్ స్టేషన్**

బోసుబొమ్మ వద్ద, నెలూరు-524 001

ఫోన్: [illegible]

## షాపింగ్ కాంప్లెక్స్ బాడుగకు ఇవ్వబడును

నెల్లూరు పట్టణ నడిబొడ్డులో నేషనల్ హైవేని ఆనుకొని ఉన్న సింధూర నర్సింగ్ హోం ఆవరణలోని షాపింగ్ కాంప్లెక్స్ (1000 Square feet area) మొదటి అంతస్తును ఆఫీసులకు, కోచింగ్ సెంటర్‌లకు, కంప్యూటర్ సంస్థలకు లేదా విడివిడిగా షాపులకు బాడుగకు ఇవ్వబడును. సంప్రదించండి.

**డాక్టర్ జి. రామచంద్రా రెడ్డి**

సింధూర నర్సింగ్ హోం కాంప్లెక్స్

కన్నింగ్‌హాం (?) [illegible] నగర్, నెల్లూరు 524 003, ఫోన్ : 322045

## రజతోత్సవ ఆహ్వానం

22.2.98 నుండి 24.2.98 వరకు

ప్రతిరోజూ ఉ7 నుండి 8 వరకు గీతాపారాయణం; 9 నుండి 12 వరకు సా. 4నుండి 6.30 వరకు జ్ఞానోపన్యాసం; 24తేది ఉ6.30 నుండి 9.30 గాయత్రి యజ్ఞం - ఆస్తికులెల్లరూ ఈ మహోత్సవములలో పాలుపంచుకొని భగవత్కృపకు పాత్రులు కావలసిందిగా ప్రార్థిస్తున్నాము.

బాలయోగీశ్వర స్వామి

**శ్రీ పంచవటి ఆశ్రమం**

(వైకుంటపురం), మైపాడు రోడ్ - నెల్లూరు - 2.

## నెల్లూరు జిల్లా పెంపుడు కుక్కల ప్రదర్శన



మార్చి 1 తేది ఆదివారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు

నెల్లూరు వి.ఆర్. హైస్కూల్ గ్రౌండ్స్‌లో జరుగుతుంది.

* ప్రదర్శనలో మీ కుక్కలను ప్రదర్శించ దలచిన వారు రిజిస్ట్రేషన్, వాటికి ముందుగా వేయించవలసిన ఇంజక్షను తదితర వివరాలను నెల్లూరు టౌన్ రైల్వే ఫీడర్ రోడులోని పశువులాస్పత్రిలో డా. వెంకటస్వామి రెడ్డి గారిని కలిసి తెలుసుకోండి.
* జీవిత కాలం మా కమిటీలో సభ్యత్వం కావల్సిన వారు రూ500/-లు చెల్లించి సభ్యత్వం పొందవచ్చును.
* ఈ పెంపుడు కుక్కల ప్రదర్శన నిర్వహణ ఎంతో వ్యయ, ప్రయాసలతో కూడినది. డాగ్ లవర్స్ అందరు దయచేసి సహాయ సహకారాలందించండి. ఈ ప్రదర్శనను విజయవంతం చేయప్రార్థన.

\- నెల్లూరు జిల్లా డాగ్ షో కమిటీ

## చింతా మోహన్

5వ పేజీ తరువాయి

చుట్టుముట్టి వుండేవి. కాని ఆ ప్రాంతాలలోని కాంగ్రెస్ వాదులందరూ నిష్కపటంగా పనిచేశారు. అది అర్థం చేసుకోలేని అమాయకుడేమీ కాదు చింతామోహన్. అయినా ఏరుదాటి తెప్ప తగలేసినట్లు, పోలింగ్ వరకు అందరిచేతా పని చేయించుకొని, ఆ తర్వాత తిట్లకు మళ్లుకున్నాడు. రాజకీయాలలో కృతజ్ఞత లేకపోయినా, కృతఘ్నత వుండకూడదు.

అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా చూస్తే సూళ్లూరుపేటలో పసల పెంచలయ్యకి ఫస్ట్ మార్కు లభిస్తుంది. నిజంగా మెచ్చుకోదగిన కష్టం ఆయనది. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో పెంచలయ్యను ఓడించడానికి చింతామోహన్ చాలా కృషి చేశాడు. ఇంకొక ప్రక్క నెలవల సుబ్రహ్మణ్యం ఆయనకు స్వయానా అల్లుడు - అయినా ఆ బాధలేవీ మనసులో పెట్టుకోకుండా పనిచేశారు. తెలుగుదేశం నుంచే కాక కాంగ్రెస్ నుంచి కూడా చదలవాడ కృష్ణమూర్తి వర్గంతోనూ శతృత్వం నెరపాల్సి వచ్చింది. అంత శ్రమ పడినందుకు ఫలితం బాగానే లభించింది. చింతా మోహన్‌కు అత్యధిక మెజారిటీ తెచ్చిపెట్టే నియోజక వర్గం సూళ్లూరుపేట.

మంత్రి పరసారత్నం తన సర్వస్వం ఒడ్డి పోరాడాడు - తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేయించడానికి. కాని ఫలితం సున్నా. గతంలో వచ్చినన్ని (36236) ఓట్లు సైతం వచ్చే పరిస్థితి లేదు. అప్పటికి తన చదువు, సంస్కారం తీసి ప్రక్కన పెట్టేసి వీధి రౌడీవలె పోలింగ్ బూత్‌లలోకి దూరి రిగ్గింగ్ చేయడానికి ప్రయత్నించా రాయన. చంద్రబాబు మెహర్బానీ కోసం తాపత్రయ పడ్డాడు. అంతా దండగే - దారుణమైన తేడాతో వెనుక బడిపోయి వుంది అక్కడ తెలుగుదేశం పార్టీ.

వెంకటగిరిలో జనార్ధనరెడ్డి అనుచర వర్గం సమస్తం చింతామోహన్‌కు సహాయ నిరాకరణ చేశారు. కాళ్ల బేరానికి వచ్చినా, కాళ్ల మీద పడి దండం పెట్టినా వారి మనసు కరగలేదు. ఫలితంగా ముప్పాతిక భాగం గ్రామాలలో కాంగ్రెస్‌కు ఏజంటు లేడు. అలివైన చోటల్లా రిగ్గింగ్ చేసుకున్నారు తెలుగుదేశం నేతలు. అందువల్లే తమకిక్కడ 35వేల మెజారిటీ వస్తుందన్నది వారి ఆశ. కాని అవి కాకి లెక్కలు. అందరు అంతగా దెబ్బ తీసినా సామాన్య ఓటరులోని అభిప్రాయాన్ని మార్చగల సామర్థ్యం ఎవరికీ లేదు. సాధారణ పరిస్థితులలో ఇక్కడ కాంగ్రెస్‌కు పెద్ద మెజారిటీ వచ్చి వుండాలి; ఇప్పుడా అవకాశం లేదు కాని మైనస్‌లో మాత్రం పడక పోవచ్చు.

నగిరి, పుత్తూరు, తిరుపతి టౌన్‌లలో చింతామోహన్‌కు మంచి మెజారిటీ వచ్చే అవకాశం వుంది. ఒక్క శ్రీకాళహస్తిలో మాత్రం తెలుగుదేశం ఆధిక్యత సాధ్యం. సత్యవేడులో ఇద్దరూ సమానమౌతారు. మొత్తం మీద చూస్తే చింతా మోహన్ గెలుపు జరిగి పోయినట్లే లెక్క; మెజారిటీ తగ్గితే తగ్గవచ్చు.

## నెల్లూరు ఫలితం

12వ పేజీ తరువాయి

కాంగ్రెస్‌కు పడినఓట్లు 40 వేల 480; సిపిఎంకు 30867; బిజెపికి 9972 ఓట్లు వచ్చాయి. గతంలో కంటే పోలైన ఓట్ల సంఖ్య8 వేలు జాస్తి. సిపిఎంకు ఓట్లు తగ్గాల్సిందే తప్ప పెరిగే అవకాశం లేదు. వారిలో నుంచి చీలే ఓట్లలో బిజెపి కంటే, కాంగ్రెస్‌కే అధిక భాగం వస్తాయి. అందువల్ల 10వేలకు పైబడిన మెజారిటీ సాధిస్తుంది ఇక్కడ కాంగ్రెస్.

### *గూడూరులో పరిస్థితి యధాతథం!*

గూడూరు నియోజక వర్గంలో గత పర్యాయం కాంగ్రెస్ అత్యధికంగా 25వేల ఓట్ల మెజారిటీ సాధించింది. కాంగ్రెస్‌కి 46వేల ఓట్లు పడితే, సిపిఎంకు కేవలం 21266 ఓట్లు వచ్చాయి. నల్లపరెడ్డి లక్ష్మీపార్వతి తెలుగుదేశానికి పనిచేయడం వల్ల ఆ పార్టీ 30వేల ఓట్లు సాధించింది. బిజెపికి కేవలం 7వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇప్పుడూ పరిస్థితి యథాతథమే. నల్లపరెడ్లు ఈసారి కూడా సిపిఎంకు మనసుపెట్టి పని చేయలేదు. గూడూరు టౌన్‌లో బిజెపి గాలి చాలా విస్తృతంగా కన్పించింది. అదే సమయంలో ముస్లిం ఓటర్లలో కాంగ్రెస్ అభిమానం వ్యక్తమైంది. ఈ పరిస్థితులలో కాంగ్రెస్‌కు గతంలో వచ్చిన మెజారిటీ ఏ మాత్రం తగ్గక పోవచ్చు.

### *అల్లూరులో అన్నిటి కంటె ఆధిక్యత*

అల్లూరు - జక్కా వెంకయ్య గారి స్వంత నియోజక వర్గం. కాని అక్కడా సిపిఎం పరిస్థితి దయనీయం, బిజెపి, సిపిఎంలలో ఎవరికి రెండవ స్థానం వస్తుందో చెప్పం కష్టం కాని - కాంగ్రెస్‌కు మాత్రం అనుకోని ఆధిక్యత లభిస్తుందని చెప్పడం సులభం. కొన్ని గ్రామాలలో కాంగ్రెస్‌కు హోల్‌సేల్‌గా ఓట్లు పడిపోయాయి.

నెల్లూరు లోకసభ నియోజక వర్గం మొత్తం మీద చూస్తే కాంగ్రెస్ అభ్యర్థిని లక్ష్మి కనీసం 75వేల నుంచి లక్ష ఓట్ల మెజారిటీతో గెల్చే అవకాశం వుంది.

## మరో బీహార్

1వ పేజీ తరువాయి

వెంకటేశ్వర్లు, చిత్తూరులో మంత్రి గోపాలకృష్ణారెడ్డి.. ఇట్లా చెప్పుకొంటూ పోతే ప్రతిచోటా ఇదే తంతు ఎమ్మెల్యేల విచ్చల విడి అయితే చెప్పతరం కాదు.

రాష్ట ప్రభుత్వ యంత్రాంగాన్ని, పోలీసు వ్యవస్థను - తమ స్వంత సైన్యంగా మార్చి పారేశారు ముఖ్యమంత్రి. నేరుగా ఫోన్లు చేసి మరీ అధికార్లకు ఆదేశాలిచ్చాడు. హత్యానేరం క్రింద, దోపిడీ దొంగలుగా జైళ్లల్లో మ్రగ్గే అరాచక శక్తులను పెరోల్‌పై విడిపించి మరీ వూర్లకు పంపారు. రిగ్గింగ్‌కు ఎవరు అడ్డం వచ్చినా నరికి పారేయడానికి సిద్ధంగా వుండినారు వీరు. ఒక పేరు మోసిన కిరాయి హంతకుడ్ని నెల్లూరు జైలు నుంచి విడిపించడమే కాదు, ఒంగోలు సభలో తన ప్రక్కన నిలబెట్టుకొని ఫోటోలకు ఫోజులిచ్చాడు చంద్రబాబు. దాని అర్థం అతడి జోలికి రావద్దని పోలీసులకు చెప్పడం. హైదరాబాద్‌లో శ్రీశైలం యాదవ్ అనే గూండాను తన పార్టీలోకి చేర్చుకోవడానికి స్వయంగా హోం మంత్రి మాధవరెడ్డిని అతడి ఇంటికి పంపాడు ముఖ్యమంత్రి. శ్రీశైలం యాదవ్‌పై 9 హత్య కేసులు కోర్టులో పెండింగ్‌లో వున్నాయని ఈనాడు దిన పత్రిక ప్రకటించింది.

ఇంకొక ప్రక్క ఈసారి ఎన్నికల్లో వలె ఎప్పుడూ ఏ దశలోనూ సారా ప్రవాహాలు, డబ్బు పందారాలు చూడలేదు మనం! బెంగుళూరు, రాజస్థాన్‌ల నుంచి కొన్ని వందల లారీల చీప్‌లిక్కర్ తెప్పించి వూరూరా దింపారు. గ్రామ గ్రామంలో లిక్కర్ బాటిళ్ల పంపకం జరిగింది. రిగ్గింగ్‌కు వెళ్లిన ప్రతిచోటా మంత్రులు, ఎమ్మెల్యేలు 50 లేదా 100 రూపాయల నోట్ల కట్టలు చేతిలో పట్టుకొని పబ్లిక్‌గా పోలింగ్ ఆఫీసర్ల బల్లల మీద పెట్టి బ్యాలెట్ పత్రాలు తీసుకున్నారు. మంత్రిగా వుండి లంచం ఇవ్వడమెట్లా అనే సందేహం; అది జనం చూస్తే అసహ్యించు కుంటారన్న సంకోచం ఏ మాత్రం లేదు. కొన్ని చోట్ల పత్రికా విలేఖర్లు దీన్ని ఫోటోలు తీస్తే - సినిమా స్టైయిల్‌లో వారిని తన్ని మరీ కెమరాలు ధ్వంసం చేశారు.

ఇంతటి దౌర్జన్యాలు, దుర్మార్గాలు ప్రచారం కాకుండా దిన పత్రికల యాజమాన్యాలను హోల్‌సేల్‌గా కొనివేశాడు చంద్రబాబు. రాష్ట చరిత్రలో ఎప్పుడూ, ఎంత పెద్ద నేతకూ అలివిగాని విషయమిది. ప్రధాన దిన పత్రికలన్నిటి నోర్లూ మూయించేశా రాయన. ఈనాడు దినపత్రికలో అయితే తనకు వ్యతిరేకంగా ఒక్క ఫోటో, ఒక్క వార్త రాకుండా కట్టడి చేసేశాడు. అత్యధిక సర్కులేషన్ కల్గిన దినపత్రిక యజమానిగా తనకున్న సామాజిక బాధ్యత కంటే, చంద్రబాబు పదవి కాపాడడమే తన ప్రథమ కర్తవ్యమని రామోజీరావు భావించి నట్లున్నారు. అందుకాయనకు ఎన్ని కోట్ల ముడుపులు అందాయో; ఎన్ని వంకర ఫైళ్లు సక్రమంగా మారాయో మనకైతే తెలియదు కాని చంద్రబాబు జరిపించిన రౌజీయిజాన్ని కప్పి పెట్టడంలో ఈనాడు నిర్వర్తించిన పాత్ర పత్రికా లోకమే సిగ్గు పడవలసినంత హీనంగా వుంది!

ఎట్లయితేనేమి - ఈ ఎన్నికల ఫలితంగా రాష్టంలో రాజకీయ వాతావరణమే కలుషితమై పోయింది. దీని ద్వారా చంద్రబాబు ఎన్ని అదనపు స్థానాలు సంపాదిస్తాడో మనకైతే తెలియదు కాని - దానివల్ల రాష్టం మాత్రం చాలా నష్టపోయింది; నష్ట పోతుంది కూడా!

## మెజారిటీ

1వ పేజీ తరువాయి

పార్టీని అభిమానించలేక, కాంగ్రెస్ ప్రక్కకు రాలేక బిజెపి పక్షం తరలిపోయారు.

ఇన్ని వర్గాల ప్రజల వలసతో తెలుగుదేశం కాంగ్రెస్ మధ్య ఓట్ల వ్యత్యాసం అపరిమితంగా వుండ బోయేట్లుంది. బొటా బొటీగా గెలిస్తే గొప్ప అనుకొనే నియోజక వర్గాలలోనూ మెజారిటీ లక్షల్లోకి వెళ్లిపోయినా ఆశ్చర్య పడనవసరం లేదు. బ్యాలెట్ పెట్టెలు తెరచిన తర్వాత కాని ఈ విషయం అర్థం కాదు.

## బిజినెస్ న్యూస్

2వ పేజీ తరువాయి

లావాదేవీలు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ షేర్ పతనం ప్రారంభం కావచ్చు - ఇన్వెస్టర్లు జాగ్రత్తగా వుండడం అవసరం.

ఈ వారంలో ధరలు పడిపోయిన కంపెనీలలో లక్మి మొదటిది, రు280 నుంచి 190లకు వచ్చేసింది. ఇటీవలనే ఈ కంపెనీని టాటాలు, హిందుస్తాన్ లీవర్‌కు 200 కోట్ల ధరకు విక్రయించారు. దానితో ఆర్థిక సంస్థలు, పెద్ద ఇన్వెస్టర్లు తమ షేర్లను బాగా అమ్మేస్తున్నారు.

## ఎరగడ్డలు

2వ పేజీ తరువాయి

ఆశించినంత లేదు. అందువల్ల ఎర్రగడ్డల ధరలు రానున్న ఒకటి రెండు నెలల పాటు రు 10 నుంచి 12ల మధ్య నిలకడగా వుండ వచ్చునని అంచనా.

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం ఎర్రగడ్డల ఎగుమతులను నిషేధించారు నేతలు. సాధారణంగా మన దేశం నుంచి ఏటా 300 కోట్ల విలువ చేసే ఎర్రగడ్డలు ఎగుమతి అవుతుంటాయి. ఎన్నికల తర్వాత ఎగుమతులు తిరిగి అనుమతిస్తే మాత్రం మళ్లీ ధరలు పెరుగుతాయి.

## నెల్లూరుముచ్చట్లు

6వ పేజీ తరువాయి

### మంచినీళ్ల కరువు

అనారోగ్యంతో ఛేర్మన్ మంచం పట్టడంతో, మునిసిపల్ అధికార్లకు మతకం పెరిగిపోయి నట్లుంది. టౌన్‌లోని చాలా ప్రాంతాలలో గత రెండు రోజులుగా మంచినీళ్లు రావడం లేదు. జనం అల్లాడి పోతున్నారు.

మునిసిపల్ వాటర్ వర్క్స్‌లో మోటార్లు తరచు కాలిపోవడం పైన విచారణ జరిపించడం అవసర మన్పిస్తున్నది. అధికార్ల అవినీతే అందుకు కారణమన్నది అనుమానం. ఛేర్మన్ వివేకానందరెడ్డి వట్టి కాగితం పులి. మాటల్లో భీకరంగా కన్పడడం తప్ప, చేతల్లో సాధువు. అది అలుసుగా తీసుకొని ఆటలాడు తున్నారు అధికారులు. ఒక్కసారి వారి వీపుల మీద కొరడా దెబ్బ పడేటట్లు, గట్టిగా వ్యవహరిస్తే తప్ప లాభం వుండేట్లు లేదు. తిన మరిగిన కోళ్లవి; ఇష్ ఇష్ అంటే భయపడవు.

### సిపి శాస్త్రి మరణం

నెల్లూరు పాతకాలం డాక్టర్ శ్రీ సిపి శాస్త్రి 8 తేది మరణించారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో నెల్లూరు పెద్దాస్పత్రికి పెద్ద డాక్టర్ ఆయన. తర్వాత ఉద్యోగం వదిలేసి, వెంకటేశ్వర నర్సింగ్ హోం పేరుతో చాలా కాలం ప్రాక్టీసు చేశారు. నవ్వుతూ నవ్విస్తూ తిరిగేవారు. ఎప్పుడు చూసినా అప్పుడే తోమిన తెల్లచొక్కా వలె తళతళ లాడుతూ కన్పించేవారు. ఆయన సతీమణి శారదా శాస్త్రి సంఘ సేవకురాలు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె; అందరూ అమెరికాలో స్థిరపడ్డారు. వారి కుటుంబానికి మాసానుభూతి.

### జనార్ధనరెడ్డి జన్మదినం

ఈరోజు (ఫిబ్రవరి 20తేది) మాజీ ముఖ్యమంత్రి ఎన్. జనార్ధనరెడ్డి జన్మదినం; ఆయన మంత్రిగానో, ముఖ్యమంత్రిగానో వుంటే నెల్లూరు నుంచి పెద్ద పెద్ద కేకులు తీసుకవెళ్లి హడావుడి చేసేవారు కాంగ్రెస్ వాదులు. అధికారం లేదు కాబట్టి సైలంట్‌గా వుండిపోయారు. అయితే ఇందిరా భవన్ కార్యదర్శి బాలసుధాకర్ మాత్రం గుర్తుగా ఈరోజు ఉదయం విశ్వభారతి అంధుల పాఠశాలలో పండ్లు పంచి పెట్టాడు.

## నెల్లూరు బజారు

మొలగొలుకులు

| | |
|---|---|
| 9672 - | లేవు |
| 9674 - | లేవు |
| బుడ్డలు | 3650/- |
| టి145 | 3800/- |
| 1001 | 3800/- |
| మొలగొలుకు బియ్యం 70కి | 800/- |
| బంగారు పవరక్రా | 3160/- |
| వెండి 10గ్రా | 92.50 |

ఇప్పుడు నిర్మల వక్కపొడిఅందిస్తుంది ఒక్కరూపాయి విలువ చేసే రెండు నిర్మల వక్కపొడి పొట్లాలు కొన్నవారు ఒక ప్యాకెట్ ఉచితంగా అడిగి తీసుకోండి.

**Before The Principal Motor Accidents Claims Tribunal, Nellore**

M.V.O.P.No: 238/97

Pydala Obulamma... Claimant

Vs

M/s. Andhra - Bangalore Road-ways Pvt. Ltd. & Others ... Respondents

**Before The Principal Motor Accidents Claims Tribunal, Nellore**

M.V.O.P.No: 239/97

P. Venkatamma... Claimant

Vs

M/s. Andhra - Bangalore Road-ways Pvt. Ltd. & Others ... Respondents

**Before The Principal Motor Accidents Claims Tribunal, Nellore**

M.V.O.P.No: 240/97

P. Jyothi being minor N.F. Mother Venkatamma ... Claimant

Vs

M/s. Andhra - Bangalore Road-ways Pvt. Ltd. & Others ... Respondents

**Before The Principal Motor Accidents Claims Tribunal, Nellore**

M.V.O.P.No: 241/97

P. Rokkanna... Claimant

Vs

M/s. Andhra - Bangalore Road-ways Pvt. Ltd. & Others ... Respondents

To : M/s. Andhra - Bangalore Road-ways Pvt. Ltd. represented by its Managing Director, B.D. Gupta, Deevan Devidi, Hyderabad.

**1వ రెస్పాండెంటుకు నోటీసు**

పై నెంబరు గల కేసులలో పెటిషనర్లు నీ మీద నష్టపరిహారం కోరుచు పై కోర్టులో మీ మీద పిటిషన్లు దాఖలు చేసియున్నారు. వాటి మీద మీకు నోటీసు నిమిత్తం 25.3.98తేది వాయిదా వేసియున్నారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా కాని మీ తరపున వకీలు గారి ద్వారా కానిపై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించ బడునని ఇందు మూలంగా మీకు తెలియ జేయడమైనది.

**V. రంగారావు**

క్లయిమెంట్లు తరపున అడ్వకేటు

# గూడూరులో మత్తుమందుల విక్రయం శృతి మించింది!

గూడూరు టౌన్‌లోని మందుల షాపుల యజమానులు డాక్టర్ల చీటీలు లేకుండానే మత్తు ఇంజక్షన్లు, మాత్రలు విక్రయిస్తూ యువతీ, యువకుల భవిష్యత్తు నాశనం చేస్తున్నారు. లాభార్జనే ధ్యేయమైన మందుల షాపుల యజమానులు పెథిడ్రిన్, కాంపోజ్, వాల్యూమ్ 10, కల్లులో నిషా కోసం ఉపయోగించే నైట్రోఫామ్ మాత్రలు విచ్చల విడిగా అమ్ముతున్నారు. చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొంటుండే ఉద్యోగస్తులు, విద్యార్థులు, యువకులు వీటికి బానిస లవుతున్నారు. ఎవరు అడిగినా ఈ మందులు ఇస్తున్నారన్న విషయమై ఈ మధ్య పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మందుల షాపుల వాళ్లతో ఘర్షణ పడ్డారు. గూడూరులోని మందుల షాపుల వాళ్లు ఎక్స్‌పైర్ అయిన మందులను కూడా యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మందులు కావాల్సి వస్తే అదనపు రేట్లు దట్టిస్తున్నారు. డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఒకసారి గూడూరు వెళ్లి వాస్తవాలను విచారించి పరిస్థితులను చక్కబరిస్తే బాగుంటుంది.

**డ్రగ్ ఇన్స్‌పెక్టర్ దొరవారూ - మీకూ మత్తు ఎక్కిందా, ఏమి?**

### కోరి వ్యతిరేకత తెచ్చుకొన్న దుర్గాప్రసాద్

గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ వ్యవహారశైలి వల్ల పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆయనకు గూడూరు డివిజన్‌లోని ఏ నాయకులూ సహకరించలేదు. దీనివల్ల ఎన్నికల యంత్రాంగం నడిపేందుకు పడరాని పాట్లు పడ్డారాయన. మంత్రిగా ఉన్నప్పుడు తమపై అసమ్మతిని రాజేశాడని నల్లపరెడ్డి కుటుంబీకులు గూడూరు వదిలేసి కోటకే పరిమితమయ్యారు. నియోజక వర్గం సంగతి చూసుకో, నా పుట్టలో వేలెందుకు పెడ్తావు అని ఇదివరలో తనను దుర్గాప్రసాద్ గద్దించాడన్న కినుకతో రాపూరు ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి గూడూరు ప్రచారంలో తలదూర్చ లేదు. చివరికి మునిసిపల్ కౌన్సిలర్లు కూడా ఆయనకు సహకరించక పోవడం వల్ల ఎన్నికల రోజు కొన్ని పోలింగ్ కేంద్రాల్లో తెలుగుదేశానికి ఏజంట్లు కరువయ్యారు. అందరితో కోరి వ్యతిరేకతను తెచ్చుకొన్నాడు దుర్గాప్రసాద్.

### ఉచిత్ర నేత్ర చికిత్సా శిబిరం

దివంగత చదలవాడ వెంకటేశ్వర్లు స్మారకార్థం గూడూరు లయన్స్ క్లబ్ ఉచిత నేత్ర చికిత్సా శిబిరాన్ని నిర్వహించింది. నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని సంచార నేత్ర చికిత్సా బృందంలోని డాక్టర్లు ఈ సందర్భంగా 145 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు నిర్వహించారు. ముగింపు సభలో

తరువ 11 పేజీలో



మాడరన్ స్కిన్ & కాస్మటాలజీ క్లినిక్ ప్రారంభిస్తున్న డాక్టర్ జి. రఘురామారావు. చిత్రంలో డాక్టర్ జె. శేషారెడ్డి, డాక్టర్ పెంచలు రెడ్డి వున్నారు.

# వెంకటగిరి మంచినీటి కొరత - తెలుగు తమ్ముళ్లు పుణ్యమే!

ఎండాకాలం రాకమునుపే వెంకటగిరిలో మంచినీటి సమస్య ప్రజలను పట్టి పీడిస్తున్నది. తెలుగు తమ్ముళ్ల సిఫార్సుల మేరకు ట్యాంకు కెపాసిటిని మించి కనెక్షన్లు ఇచ్చివేయడంతో, పలు ప్రాంతాల్లో నీటికి కటకట లాడవలసి వస్తుంది. తెలుగుదేశం నాయకులు ఎక్కువగా నివాసముండే తూర్పువీధి ప్రాంతానికి ఎక్కువ సమయం నీటి సరఫరా చేయమని పంచాయతీ సిబ్బందిపై ఒత్తిడి తెస్తుండడంతో, ఇతర ప్రాంతాల ప్రజలు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. వీధి కొళాయిలు చాలా చోట్ల విరిగిపోయినా వాటి స్థానంలో కొత్తవాటిని బిగించక పోవడంతో చాలా చోట్లనీళ్లు వృధాగా పోతున్నాయి. పంచాయతీకి సంబంధించిన ప్రతి చిన్న విషయంలోనూ తెలుగు తమ్ముళ్లు జోక్యం చేసుకోవడం వల్ల సవాలక్ష సమస్యలు ఉత్పన్న మవుతున్నాయి.

### బుచ్చిలో పినాకినీ గ్రామీణబ్యాంకు

బుచ్చిరెడ్డి పాళెంలో పినాకినీ గ్రామీణ బ్యాంకు భవనాన్ని హైదరాబాద్‌లోని నాబార్డుచీఫ్ జనరల్ మేనేజర్ వి. జల్మారావు 13తేది ప్రారంభించారు. నాబార్డ్ ఎజిఎం మంజునాథన్, సిండికేట్ బ్యాంక్ డిఎం. ఆరులయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే రోజు నెల్లూరులోని పినాకినీ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మహిళా అభివృద్ధి విభాగాన్ని రిటైర్డ్ సివిల్ సర్జన్ డాక్టర్ రాజమ్మ ప్రారంభించారు. బ్యాంక్ ఛైర్మన్ ఎన్. మోహనకృష్ణ, ఇతర ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### సాహిత్య సదస్సు వారి సాహిత్యోపన్యాసాలు

నెల్లూరు సాహిత్య సదస్సు యాజమాన్యాన 'సాహిత్య పంచమి' పేరున సాహిత్యోపన్యాసాలు 23 తేది నుంచి 27

**జిల్లావార్తలు**

తేది వరకు టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్నారు. 23తేది ఎస్వీ యూనివర్శిటీలో పనిచేస్తున్న డాక్టర్ జి. దామోదర నాయుడు మను చరిత్ర - భారతీయ సంస్కృతి అనే అంశంపై మాట్లాడుతారు. 24తేది ఎస్వీ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ జి. చలపతి కవి కర్ణ రసాయనంపై, 25తేది ప్రొఫెసర్ వి. సర్వోత్తమరావు పారిజాతాప హరణాన్ని వివరిస్తారు. 26, 27తేదీల్లో ధర్మవరానికి చెందిన డాక్టర్ ఏ. వీరాంజనేయులు, నిర్వచనోత్తర రామాయణ ప్రశస్తి, విరాట పర్వ వైశిష్ట్యాన్ని విశదీకరిస్తారని నిర్వాహకులు స్వయంపాకుల శ్రీనివాసులు, గోసుకొండ వెంకట సుబ్బయ్య తెలియజేశారు. *

# కాంగ్రెస్ బలముంటే బందోబస్తు - తెలుగు స్థానాల్లో ఆబ్సెంటు!

పార్లమెంటు ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోను రాపూరు, పొదలకూరు ఓటర్లు పెద్దగా ఉత్సాహం చూపించలేదు. గ్రామాల్లో ఉదయం నుంచి మందకొడిగా పోలింగ్ జరిగింది. మనుబోలు, గూడూరు, చిల్లకూరు వంటి ప్రధాన కేంద్రాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల వరకు ఓటర్లు కనిపించలేదు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి స్వగ్రామమైన వాకాడు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10.30 ప్రాంతానికే 40 శాతం ఓట్లు పోలయ్యాయి. నల్లపరెడ్ల `కోట' అయిన కోట గ్రామంలో కాంగ్రెస్, సిపిఎం, బిజెపి పార్టీలు ఏర్పాటు చేసిన మూడు శిబిరాల్లోనూ ఉత్సాహం కనపడుతుండినా, ఎన్సీ చేయూతతో కార్యకర్తల్లు మరింత అధికంగా కలకలం సృష్టిస్తుండినారు. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీమతి పనబాక లక్ష్మి అత్తగారి గ్రామమైన వెంకన్న పాళెంలో 11 గంటల ప్రాంతంలో 50శాతం ఓట్లు పోలయ్యాయి. స్త్రీ, పురుష ఓటర్లు ఈ గ్రామంలో ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొనడం కనిపించింది. మాజీ సారా కాంట్రాక్టర్ రావుల అంకయ్యగౌడ్‌కు పట్టున్న బ్రాహ్మణపల్లి, రాజుపాళెం, బిరదవోలు గ్రామాల్లో మధ్యాహ్నం ఒంటి గంటకే 60 శాతం ఓట్లు పోలయ్యాయి. రావుల దశయ్యగౌడ్ స్కూటర్‌లో తిరుగుతూ ఓటర్లను ఉత్సాహ పరుస్తూ కనపడ్డారు. పొదలకూరులో మధ్యాహ్నం ఒంటి గంటకు 50 శాతం ఓట్లు పోలయ్యాయి. రాపూరు టౌన్‌లో ముస్లిం మహిళలు మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటు కోసం నిలబడి ఉండడం ప్రత్యేకతని చెప్పవచ్చు. కాంగ్రెస్‌కు ప్రాబల్యముండే రాపూరు, వాకాడు వంటి చోట పోలీసు బందోబస్తును ఎక్కువగా పెట్టి పర్యవేక్షణకు డిఎస్పీ స్థాయి అధికారిని నియమించారు. `కోట' వంటి తెలుగుదేశం అనుకూల గ్రామాల్లో పోలీసులే కానరాలేదు. ఎస్పీ చెప్పిన ప్రత్యేక మెరుపుదళాలు, ఆకస్మిక తనిఖీ దళాలు దుర్భిణీ వేసి వెతికినా

తరువ 11 పేజీలో

**ఎన్నికల్లో పోలీసు పక్షపాతం**


**In The Court of the District Judge, Nellore**

O.P. 64/98

1. Mannepalli Srinivasulu & another ... Petitioners

Vs

1. Nellore Bujjaiah; 2. Mannepalli Sumanthkumar, being minor represented by mother guardian Mannepalli Radha; 3. Life Insurance Corporation of India, Nellore Branch-II, Brindavanam, Nellore ... Respondents

**NOTICE**

పై నంబరున పిటిషనర్లు లేట్ శ్రీమతి మన్నేపల్లి రామమ్మ తాలూకు గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్, LIC నుండి రావలసిన మొత్తం Amountను పొందగోరు నిమిత్తం Succession Certificate కోరి పిటిషన్ దాఖలు చేసి యున్నందున ఎవరికైన అభ్యంతరాలు వున్న వారు 4.3.1998తేది పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపు కోవలసినది లేని యెడల వారి పరోక్షమున పిటిషన్ తీర్మానించ బడును.

**P.V. Ramana Reddy**

పిటిషనరు తరఫు వకీలు, Nellore


# కార్డుసైజు కథలో కారల్‌మార్క్సు సిద్ధాంతం సుబోధకం!

శ్రీ కేతు విశ్వనాథ రెడ్డి మార్క్సిస్టు; మంచి కథకుడు. ప్రాయికంగా ఆయన కథలన్నీ మార్క్సిస్టు తాత్త్వికవ నేపథ్యంతో నడుస్తుంటాయి. 'మారుపేర' పోస్టు కార్డు మీద రాసిన కథ.

నాగరికత ముదిరేకొద్దీ కళలు - ముఖ్యంగా కవిత్వం దిగనాస్తి అవుతుందని సుప్రసిద్ధ ఆంగ్ల విమర్శకుడు, కవి మాథ్యూఆర్నాల్డ్ అంటాడు. నిజమే ననిపిస్తుంది - నాగరిక జీవనంలో కుక్షింభరత్వానికైన కుమ్ములాటకే ఉన్నపొద్దు చాలక జనం సతమత మవుతూ, ఉంటారు. నగర జీవితాలకు కుదురుండదు. ఆగమూ, నిగమూ హెచ్చు; నెనరు న్యాయమూ నెమ్మది లోచ్చు. తీరని కోరికల వేటలో ఆరని ఆరాటం. తీరుబాటు లేని బ్రతుకుల్లో సాలోచనకు, సారస్యానికి నిలువ నీడ ఉండదు. హృదయోల్లాసానికి, బుద్ధి వికసనానికి తోడ్పడే కళల సంగతి ఎవరు పట్టించు కొంటారు. కాదు, కూడదు అంటే - పొద్దు పోకకు పొయ్యిలో నీళ్లు పోసినట్లు వ్యాపార జీవన సరళికి సరిపొయ్యే వాణిజ్య చిట్కా మట్కా సాహిత్యాన్ని ఆటోలనో టౌనుబస్సుల్లోను చదివి పారేస్తుంటాం. ఆలోచనా ప్రేరకమూ, ఆహ్లాదాత్మకమైన సాహిత్యం సకృత్తుగా తప్ప సర్వత్రా కనిపించదు.

**రాయి - తురాయి**

ఇటువంటి సంక్లిష్ట సంకీర్ణ నాగరిక సమాజంలో చిత్తశుద్ధి కలిగిన, సామాజిక చైతన్యం ఉన్న రచయిత ఇటువంటి ప్రక్రియల్ని చేపడతాడు. తాను స్థాపించదలచు కొన్న సత్యాన్ని సూక్ష్మంలో మోక్షం అన్న చందంగా నిక్షిప్తం చేస్తాడు. ఇటువంటి ప్రక్రియల్లో, కథావిస్తృతిని మట్టుసం చేసి, శిల్పానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. కొన్ని నగ్న సత్యాలను పాఠకుని ఊహకు వదిలెయ్యటం

తరువ 11 పేజీలో

# సన్మానాల వ్యాపారం ఇక సాగనివ్వబోమని సినీజీవుల శపథం!

సంస్కృతిని కాపాడ వలసిన సంస్థలు వ్యాపార సంస్థలుగా మారి పోవడం వల్ల మనశ్శాంతి లేకుండా చేస్తున్నారని వాపోతున్నారు హైదరాబాద్‌లోని సినిమా జీవులు. అందుకే అలాంటి వాటిని ప్రోత్సహించ రాదని ఇటీవల "సినీ జీవులు ఒక నిర్ణయం తీసుకొన్నారు. సినిమా వాళ్ల పేర్లను చెప్పుకుని ఈ సంస్థలు డబ్బు చేసుకుంటున్నాయని ఆలస్యంగానైనా పరిశ్రమ గుర్తించింది. "మేము అవార్డులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నందు వల్లనే హైదరాబాద్‌లో సినిమా పరిశ్రమ మూడు పువ్వులూ ఆరుకాయలుగా వర్ధిల్లుతుంది, అంటూ ఒకప్పుడు కాలినడకన వచ్చే కొందరు నిర్వాహకులు బాగా డబ్బు చేసుకొని కార్లలో తిరగడంతో మిగతా పనిలేని పుల్లయ్యలూ ఆకర్షితు లయ్యారు. ఒకలక్ష్యం, గమ్యంలేని సాంస్కృతిక సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. కొత్తగా సినిమా రంగంలో ప్రవేశించిన వారికి సైతం సన్మానాలు చేస్తామంటూ ఈ ప్రబుద్ధులు తిరగడం ఎక్కువైంది. సినిమా తారలకు ఘన సన్మానమంటూ కొందరు వ్యాపారవేత్తలను నమ్మించి, వారి చేత సభ తమ స్పాన్సర్ చేయిస్తున్నారు. మరికొన్ని ప్రకటనలు సేకరించి సావనీర్‌ను అచ్చు వేయిస్తారు. సన్మాన సభ ఎలాగో అయిందని పించాక ఖర్చులు పోను ఎంత మిగిలిందని లెక్క వేసుకుంటారు. ఇలా పబ్బం గడుపుకునే వారి ఆటలు ఇటుపైన సాగవనే చెప్పాలి. ఇలాంటి సంస్థలను ప్రోత్సహించరాదని సినిమా జీవులు నిర్ణయం తీసుకున్నారు.

**హైదరాబాదు కళా సంస్థలకిక గడ్డు రోజులే!**

### "ఆల్ రౌండర్" మార్చిలో విడుదల

"పరీక్షలు, ఎన్నికల మూలంగా మార్చి చివరన విడుదల చేద్దామను కుంటున్నాం," అన్నారు టి. ప్రభాకర్. ఈయన కథ సమకూర్చి, దర్శకత్వం నెరిపే "ఆల్‌రౌండర్" చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, సంఘవి, బాబూమోహన్, రామిరెడ్డి, జయప్రకాష్, రఘునాథరెడ్డి, నాగరాజు పాత్రధారులు. సంగీతం: వీణాపాణి.

# పూలతోటల్లో షూటింగ్‌లంటే నగ్మాకు చెమట పడ్తుందట!

నగ్మాకు నచ్చని ఒకే విషయం పువ్వులు. సిగలో కాగితపు పువ్వు జొప్పించడానికి కూడా ఆమెకు మనస్కరించదట. తలపోటు వస్తుందేమోనని ఆమె భయమట. "టూపీస్ దుస్తుల్లో నటించడానికి ఒప్పుకుంటానేమో గాని, ఏదైనా పూలతోటలో షూటింగ్ అంటే నాకు ముచ్చెమటలు పోస్తాయి," అంది నగ్మా.

**మద్రాసు సినిమా వార్తలు**

### నమోదు చేయబడిన చిత్రాల పేర్లు

ఫాంట్ ఫిలిమ్స్ "గువ్వ", విశాంత్ సినీ క్రియేషన్స్ "విష్ణు", దేవి ఫిలిమ్ ప్రొడక్షన్స్ "డ్రయివర్", ప్రతాప్ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ "పెళ్లి పల్లకి", సాయిగోపి ప్రొడక్షన్స్ "ప్రజల మనిషి", శ్రీ గజలక్ష్మి ప్రొడక్షన్స్ "ప్రేమిస్తే పెళ్లి చేసుకో", హిందూస్థాన్ మూవీ మేకర్స్ "కూలి రాజా", శ్రీ రంగోప ఆర్ట్స్ "రౌడీ బ్రదర్స్". నిశాంత్ సినీ క్రియేషన్స్ "అప్పగింతలు". శ్రీ సాయిరామ్ క్రియేషన్స్ "చెప్పుకుంటే సిగ్గు". ఓం మూవీ మేకర్స్ "గాంధీ 1947 to AK 47", శ్రీసాయిదత్త ప్రొడక్షన్స్ "నాగులు తిరిగే కోన". ఎంఎల్ మూవీస్ "మంగళ సూత్రం". కవిత ప్రొడక్షన్స్ "పిరికి వీరుడు". శ్రీమన్నారాయణ పిక్చర్స్ "పసుపుతాడు". సాయిగోపి ప్రొడక్షన్స్ "ప్రజల మనిషి". శ్రీరంగోప ఆర్ట్స్ "గూండా బ్రదర్స్". ఫాంట్ ఫిలిమ్స్ "ఫ్రెండ్స్", కుబేర్ క్రియేషన్స్ "A".

### పిరికి ప్రియుడు

"హాస్య ప్రధాన చిత్రం", అన్నారు ఏలూరి మల్లికార్జున్. రచన:ఎం.ఎస్. నారాయణ.

### "వార్త"

దాసరి ఫిలిమ్ స్టూడియో "తిరుపతి" పతాకంలో తయారయ్యే చిత్రం పేరు "వార్త". దర్శకత్వం: దాసరి. ఇది పత్రికా ప్రపంచంపై తీసే చిత్రమట.

### భానుమతి నటించే చిత్రం

"చాలా కాలం తర్వాత నటిస్తున్నాను," అన్నారు భానుమతి. ఈమె కోడి రామకృష్ణ దర్శకత్వం వహించే ఎస్‌వివిఎస్ క్రియేషన్స్ చిత్రంలో నటిస్తోంది.

తరువాత 11 పేజీలో



తెలుగోడు చిత్రంలో నారాయణమూర్తి, ఇందు

# సౌందర్య కంటే మా ఆవిడ పొట్టి

"సూర్యవంశం" హిందీ చిత్రంలో అమితాబ్ సరసన సౌందర్య నాయిక". మీ పొడుగు ఏమిటి, సౌందర్య పొడుగు ఏమిటి? మీ పక్కన ఆమె ఎలా ఉంటుంది?" అని అమితాబ్‌ను అడిగితే," భేషుగ్గా ఉంటుంది. నిజ జీవితంలో నా భార్య జయబాధురి సౌందర్య కంటే పొట్టి," అంటూ నవ్వేశాడు అమితాబ్.

**పొట్టి హీరోయిన్ ప్రక్కన పొడుగు హీరోగా వుండను అమితాబ్ చెప్పిన సమర్థన**

### బెంగుళూరులో రోజా భవనాలు

"అవునండి, కొన్ని భవనాలు నిర్మిస్తున్నాను. సినిమాలనే నమ్ముకొంటే ఎలా? అంచేత, రియల్ ఎస్టేట్ బిజినెస్‌ను చేయక తప్పింది కాదు. ప్రత్యేకంగా మాకోసం నిర్మించే భవంతిలో స్విమ్మింగ్ పూల్, బాడ్మింటన్ కోర్టు, లిఫ్టు కూడా ఉంటాయి", అంది రోజా.

### "హలో... ఫ్రెండ్"

"జయసుధ చెల్లెలు అయిన అలనాటి నటి సుభాషిణి కుమార్తె పూజను నాయికగా పరిచయం చేస్తున్నాం," అన్నారు జగన్. ఈయన దర్శకత్వం వహించే "హలో... ఫ్రెండ్" చిత్రంలో అర్జున్, రఘువరన్, రాధారవి, సుధాకర్, బాబూమోహన్, ప్రసాద్‌బాబు, రేఖ, సింధు, మాస్టర్ దినేష్ నటవర్గం. మాటలు: నడిమింటి నర్సింగరావు. పాటలు: భువన చంద్ర. సంగీతం: ఎస్.ఎ. రాజ్‌కుమార్.

### "మా విడాకులు"

"ఈ చిత్రం టైటిల్‌కు రెండు అర్థాలున్నాయి. మావిడాకులు - శుభసూచకం. మా- విడాకులు... వేరే అర్థం. రెండు పాటలను సింగపూర్‌లో, ఒక పాటను ఐలెండ్‌లో ఫిబ్రవరి 15 నుంచి చిత్రీకరించ బోతున్నాం. మార్చిలో విడుదలకు సినిమా రెడీ అవుతుంది," అన్నారు డైరెక్టర్ ఇవివి. సత్యనారాయణ. "మా విడాకులు" చిత్రంలో జగపతి బాబు సరసన రచన, నీలా నాయికలు. *

**మగాడు విచ్చలవిడిగా తిరిగితే రసికరాజు - స్త్రీ పరపురుషుడి సాంగత్యం కోరితే బరితెగించిన ఆడదా? ఎందుకీ వ్యత్యాసం? లైంగిక స్వాతంత్ర్యం స్త్రీకి సైతం వుండాల్సిందే నని బల్లగుద్ది మరీ వాదించిన అభ్యుదయ చిత్రం**

# కామసూత్ర

**చిత్రసమీక్ష**

**గృద్దయూరు గోపాలరావు**

తల్లి, చెల్లి, భార్య, కూతురు, పిన్ని, అత్త, స్నేహితురాలు ఇలా కొన్ని బాంధవ్యాలు సమాజంలో స్త్రీకి గౌరవ స్థానాలు; వెలయాలు, వేశ్య అనే నిర్వచనాలు సమాజంలో స్త్రీకి అపవిత్ర స్థానాలు.

మంగళ సూత్రం స్త్రీకి పాతివ్రత్యం పరిధి ఏర్పరుస్తుంది. కామసూత్రం లైంగిక స్వేచ్ఛకు మార్గం తీర్చి పవిత్రతను కూలుస్తుంది. అందువల్ల స్త్రీ కామసూత్రం మార్గం పట్టకుండా మంగళ సూత్రాన్ని అంటి పెట్టుకోవటం ధర్మం. భార్య వుండి కూడా మరో స్త్రీతో సంబంధం ఏర్పరచుకున్న మగాడి మీద సమాజం ఏ నిందారోపణా మోపదు. మగాడి విషయంలో భార్య, ప్రియురాలు అనే రెండు జీవితాలను వేలాది సంవత్సరాల నుంచి సమాజం సమర్థిస్తూ వుంది. లైంగిక స్వేచ్ఛ మగవాడికి సహజంగాను; స్త్రీది అసహజంగాను, ఆచరణీయం కానిదిగాను సమాజంలో అలిఖిత శాసనంగా నిలిచి పోయింది. ఆ శాసనాన్ని ఉల్లంఘించి లైంగికవాంఛ తనకూ సహజగుణమే అని భావించిన స్త్రీని, బరి తెగించిన ఆడదిగా సమాజం వెలివేస్తూ వుంది. స్త్రీకి భర్త లోడిదే లోకం అని ఆంక్షలు విధించినా, పలు కారణాల వల్ల అక్కడక్కడా స్త్రీ మరో మగాడి వైపు దృష్టి సారిస్తూ వుంది. ఆర్థిక ప్రయోజనం పొందేందుకు ఒక్కోచోట స్త్రీ పరాయి మగాడి శయ్యను పంచుకుంటూ వుంది. భర్త దగ్గర పొందలేని లైంగిక తృప్తిని భర్తీ చేసుకునేందుకు ఇరుగు పొరుగు మగాడి సాంగత్యం పొందుతూ వుంది. భర్త సాధింపులు, వేధింపులతో ఊపిరాడని అస్వతంత్ర స్థితి నుంచి బయట పడిన స్త్రీ ఓదార్పు, ఊరడింపు అందించే పరాయి చేతుల్లో ఒరిగి పోతూ వుంది. మానసిక తపనతో మాతృత్వం అన్వేషించుకునే స్త్రీ ప్రియుడి కౌగిట్లో కరిగి పోతూవుంది.

మగాడు ఏఏ కారణాలతో లైంగిక స్వేచ్ఛను పొందుతున్నాడో, దాదాపు అవే కారణాలతో ఎదురు మదురుగా స్త్రీ కూడా లైంగికానందం అందుకొంటూ వుంది. మగాడి లైంగిక స్వేచ్ఛ అతడి సామర్థ్యానికి గీటురాయిగా పరిగణింప బడుతూవుంది. స్త్రీ విషయంలో అదిఆమె పవిత్రతకు మచ్చగా పరిహసింప బడుతూ వుంది. ఈ అసమానత సమంజసమా? సమర్థనీయమా?

ఈనాటి స్త్రీ, మగాడితో సమాన హక్కుల కోసం అభ్యుదయ పథంలో పోరాటం సాగిస్తూ వుంది. స్త్రీకి కూడా మగాడితో సమానంగా లైంగిక స్వేచ్ఛ

తరువాత 11 పేజీలో

# వారఫలాలు

*తేది 21.2.98 నుంచి 27.2.98 వరకు సింహంలో రాహువు; 22 తేది వరకు ధనుస్సులో శుక్రుడు, తరువాత మకరంలో; కుంభంలో రవి, గురు, బుధ, కేతువులు; 23 తేది వరకు కుంభంలో కుజుడు, తరువాత మీనంలో; మీనంలో శని; ధనుర్మకర, కుంభాలలో చంద్రుడు.*

### మేషం
(అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం)

ఆర్థిక స్థితి ఆదాయం సామాన్యంగా ఉంటుంది. కుటుంబ సంబంధమైన, ఉద్యోగ పరమైన సమస్యలు కలిగి తొలగుతాయి. సొంత పనులు ఆలస్యంగా జరుగుతాయి. దైవ పరమైన కార్యక్రమాలు చేయుట, దూర ప్రయాణాలు చేస్తారు. ఇతరులకు ఆర్థిక, మాట సహాయాలు చేయవలసి వచ్చును. కుటుంబ సౌఖ్యం ఉండును.

### వృషభం
(కృత్తిక, 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2పాదాలు)

వృత్తి, వ్యాపారాలందు ఆదాయం బాగుండును. ఆరోగ్యం కూడా సరిగా ఉండదు. కుటుంబ వ్యవహారాలకు చెందిన కొద్ది సమస్యలు కలుగవచ్చును. అనుకొనని అదనపు పనులు పైనబడతాయి. మంచి కాలక్షేపణ, బంధుమిత్రుల రాకపోకలు ఉండును. కొత్త వస్తువులు కొనడం, పెట్టుబడులకు ప్రయత్నాలు జరుగుతాయి.

### మిధునం
(మృగశిర 3,4పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)

ఆదాయం, ఆర్థిక పరిస్థితి సామాన్యంగా ఉంటుంది. ఉదరకోశ సంబంధమగు రుగ్మతలు ఉండును. సాంఘిక, సాహిత్య కార్యక్రమాలలో పాల్గొనుట, కుటుంబ సౌఖ్యం బాగుండును. అనుకొనని ప్రయాణాలు ఏర్పడుతాయి. పాత బాకీలు లభించ వచ్చును. నూతన వ్యాపార ప్రయత్నాలకు అనుకూలత ఉంటుంది.

### కర్కాటకం
(పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేషలు)

వ్యవహారాలు కొంత బాధాకరంగా ఉంటాయి. ఆరోగ్యం కూడా అంతే. ఆదాయం పరవాలేదని పిస్తుంది. వృత్తి, వ్యాపార వృద్ధి ప్రయత్నాలకు ఒత్తిడి ఇతరుల నుండి ఎక్కువగు తుంది. కొత్త పరిచయాలు, ఉద్యోగ బాధ్యతలు పెరుగును. నలుగురితో కలసిన కాలక్షేపం ఉంటుంది.

### సింహం
(మఖ; పుబ్బ; ఉత్తర 1వ పాదం)

తొందరపాటు, అతి ప్రవర్తన వల్ల చిక్కులు వస్తాయి. ఆదాయం ఆశించి నంతగా ఉన్నా అనుకొని ఖర్చులు కూడా ఉంటాయి. సత్సంగ కార్యకలాపాలు, ఉద్యోగ బాధ్యతల నిర్వహణ పెరుగుతుంది. పిల్లలకు సంబంధించిన ప్రయత్నాలు అనకూలించ వచ్చును. కుటుంబ సౌఖ్యం ఉండినా, వారం మధ్యలో ఆరోగ్యం సరిగా ఉండదు.

### కన్య
(ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త; చిత్త 1,2 పాదాలు)

ఆశించినంత రాబడి ఉండదు. ప్రయత్నాలకు ఎదురు దెబ్బలు తగులుతాయి. ఆరోగ్య లోపం, చిన్న గాయాలు తగుల వచ్చును. పని ఒత్తిడి, కోపం విసుగు ఎక్కువగా ఉంటుంది. స్థిరాస్తుల రాబడికి లోటుండదు. కుటుంబ సౌఖ్యం, సామాజిక, సాహిత్య, కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతుంది. సుఖ కరమగు వార్తలు వింటారు.

| పంచాంగం | | | |
|---|---|---|---|
| 25 తేది బుధవారం మహా శివరాత్రి | | | |
| ఫిబ్రవరి తిథులు | | | |
| మాఘబహుళ | | | |
| తేది 21 | శని | దశమి | పూర్తిగా |
| తేది 22 | ఆది | ఏకాదశి | రా.గ 5.40వ |
| తేది 23 | సోమ | ద్వాదశి | రా.గ 4.50వ |
| తేది 24 | మంగళ | త్రయోదశి | రా.గ.3.28వ |
| తేది 25 | బుధ | చతుర్దశి | రా.గ.1.48వ |
| తేది 26 | గురు | అమావాస్య | రా.గ.11.48వ |
| ఫాల్గుణ శుక్ల | | | |
| తేది 27 | శుక్ర | పాడ్యమి | రా.గ 9.40వ |

స్వయంపాకుల శ్రీనివాసులు ఎం.ఎ

### తుల
(చిత్త 3,4పాదాలు, స్వాతి, విశాఖ1, 2, 3 పాదాలు)

ఈ రాశి వారికి ఆదాయం, వృత్తి, వ్యాపారాలందు సామాన్యం. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధ ఉండును. అనవసర వ్యవహారాలలో జోక్యం చేసికొనకండి. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలు ఉండును. సాహిత్య కార్యక్రమాలలో పాల్గొంటారు. మిత్రుల సహకారంతో పనులు నెరవేరుతాయి.

### వృశ్చికం
(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

వృత్తి, వ్యాపారాలందు కొంత అభివృద్ధి కనపడుతుంది. ఉద్యోగులకు అధికారుల తోడ్పాటు బాగుంటుంది. ఉన్న సమస్యలు, చేస్తున్న పనులు నెమ్మదిగా అనుకూలిస్తాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఇతరులకు డబ్బు రూపంలో మాట రూపంలో సహాయ పడతారు. సత్కాలక్షేపణ ఉంటుంది.

### ధనుస్సు
(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పాదం)

ఏ విధమైన ఇబ్బందులున్నా నెమ్మదిగా తొలిగిపోవును. ఆర్థికస్థితి ఆశావహంగా ఉంటుంది. వృత్తి, వ్యాపార వృద్ధి ప్రయత్నాలు జరుపుకొన వచ్చును. కొద్దిపాటి అనారోగ్యం కలుగును. పిల్లల వివాహ, విద్యా ప్రయత్నాలు అనుకూలించును. ప్రయాణాలు, మంచి కార్యక్రమాలందు పాల్గొంటారు.

### మకరం
(ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1,2 పాదాలు)

ఆదాయానికి తగిన ఖర్చులు ఏర్పడగలవు. కన్ను, తలకు సంబంధించిన రుగ్మతలు ఉంటాయి. అదనపు బాధ్యతలు ఉద్యోగులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అంతరంగికులతో జాగ్రత్తగా మెలవండి. ఆర్థికమైన వత్తిడి పెరుగుతుంది. భార్యా పిల్లల అనారోగ్యం ఉండవచ్చు. సత్కర్మలలో పాల్గొంటారు.

### కుంభం
(ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిష, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)

అదనపు ఖర్చులు, ఆదాయం లేని పనులు చేయడం, శ్రమ కోపం ఎక్కువగా ఉంటుంది. డబ్బు రాబడి సామాన్యం. కొత్త వస్తువులు కొనడం, ప్రయాణాలు, సామాజిక కార్యాలలో పాల్గొనుట జరుగుతుంది. ఆరోగ్య విషయాలలో జాగ్రత్త పడాలి. కష్టమైన వార్తలు వింటారు.

### మీనం
(పూర్వాభాద్ర 4 పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

అన్ని విధాల ఇబ్బందులున్నా గౌరవానికి లోటుండదు. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. ప్రయాణాలు సత్కర్మలలో పాల్గొంటారు. కుటుంబ సౌఖ్యం ఉంటుంది. అనవసర సంభాషణలలో పాల్గొనకండి, తగాదాలు వస్తాయి. బంధువుల రాకపోకలు ఉంటాయి. కొద్దిగా ఆరోగ్యలోపం.

## జనవాణి

మూడవ పేజీ కోరవ

ఇండిపెండెంట్లు ఎక్కువ సంఖ్యలో పోటీ చేస్తున్నారని ధరావత్తు రుసుం ఎక్కువ చేశారు. ఈసారి ఎన్నికలు జరిగిన చోట నామినేషన్ పత్రాలపై ముఖ్య అభ్యర్థుల గుర్తులు పత్రంలో ముందు వరుసలో వుండేలా జాగ్రత్తలు తీసుకొన్నారు. ఈ నిబంధనలతో పాటు పోటీ చేసే అభ్యర్థులు వారి ఆస్తులు కూడా ప్రకటించాలని ఖచ్చితమైన నియమం పెట్టి ఉంటే బాగుండేది. దీనివల్ల నాయకుల ఆస్తులు ప్రజలు తెలుసుకోగలిగేవారు. ఈసారి ఎన్నికల నాటికి కమీషన్ ఈ నియమాన్ని అనువర్తింపజేస్తే బాగుంటుంది.

నెల్లూరు — పి. పవన్‌కుమార్

### ఎన్నికలు జరిగాయి!

మొదటి విడతగా జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో దేశ వ్యాప్తంగా 30 మంది, మన రాష్ట్రంలో ముగ్గురు చని పోయారు. రచ్చలు, రావిళ్లు జరగకుండా ఏ నియోజక వరంలోనూ పోలింగ్ జరగలేదు. పోలీసులు, అధికారుల సాక్షిగా రిగ్గింగ్, దొంగఓట్లు వేసే కార్యక్రమాలు యథేచ్ఛగా జరిగిపోయాయి. ఎవరికి బలమున్న చోట్ల వాళ్లు తమ సత్తా చూపించి ప్రజాస్వామ్య వ్యవస్థను వెక్కిరించారు. దేశం మొత్తం మీద 60 శాతం మంది ఓటు హక్కును వినియోగించు కొన్నారని అధికారులు ప్రకటిస్తున్నా; 40శాతం మంది ప్రజలే వాస్తవంగా ఓటు హక్కు వినియోగించు కొన్నారని చెప్పాలి. మిగతా ఓట్లు రకరకాల పద్ధతుల్లో పోలవు తున్నాయి. డబ్బు, హింస, దాదాగిరి ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషించడం నానాటికీ ఎక్కువై పోయింది. ఇవి తగ్గితే కాని ప్రజాస్వామ్యం పరిఢవిల్లదు.

నెల్లూరు — జి. విశ్వేశ్వరరావు

సాగర్ బ్రాండ్
బిస్కట్స్
హోల్‌సేల్‌గా
లభించును
విజయ
వక్కపొడి
ట్రంకురోడ్డు, నెల్లూరు
ఫోన్: 323372

### సంపాదకీయం బాగుంది!

జమీన్‌రైతులో `బిజెపి నిజరూపం' అని వ్రాసిన సంపాదకీయంలో ప్రతి పేరా, ప్రతి వాక్యం, ఇంకా చెప్పాలంటే ప్రతి అక్షరం ఎంతో ఆలోచింప జేసింది. బిజెపి నిజరూపాన్ని సామాన్య పాఠకులకు కూడా అర్థమయ్యేలా కళ్లకు కట్టినట్లు వ్రాసిన మీకు నా అభినందనలు.

కోవూరు — కె. చంద్రమోహన్‌రెడ్డి

### బిజెపి ప్రభంజనం?

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీకి మెజార్టీ స్థానాలొస్తాయి. దేశవ్యాప్తంగా ప్రజలందరూ ఒకసారి బిజెపికి అవకాశం ఇవ్వాలనే ఆలోచనకు రాబట్టి బిజెపి ఢిల్లీ పీఠం ఎక్కబోతున్నది. సుస్థిర పాలన నినాదం, వాజ్‌పేయి ఛరిస్మా వల్లే నెల్లూరు పార్లమెంటు ఎన్నికల్లో సైతం బిజెపి అభ్యర్థి సైతం సంచలనం సృష్టించ బోతున్నారు.

నెల్లూరు — మల్లూరు గోవిందయ్య

## యాభై ఏళ్ల క్రితం

మూడవ పేజీ కొరవ

జిల్కొదవేలయో `సుగుణ' మాంబా! ఇంక నోర్మూయుమా!

సలాం సాహెబుగారూ! దోషమేం లేదండి! మొన్నొకనాడు దరస్మిత సుందర వదనారవింద యగు డా. సుగుణమ్మ గారు మీ గదిలోంచి తటాలున వస్తూ వీధివాకిట్లో నాకంట బడిందండి! మాములు మర్యాదతో ఆమెకు నమస్కరించాను. పది అడుగులు రిక్షాలో పోయి నన్ను బులావ్ అన్నది, వెనుకకు వెళ్లాను. లార్డు కూతురు మాదిరి రిక్షాలో కూర్చున్న ఆమెగారు - వీధిలో ముద్దాయిలా నిలుచున్న నాతో పది నిముషాలు మా పత్రికలోని వ్రాతలను గూర్చి ప్రశ్నించింది. వినయవిధేయతలతో సమాధాన మిచ్చాను. రాను రాను ముదిరి మా పత్రికను దూషించడం ప్రారంభించింది - సహజ నేటి వక్రపు ధోరణిలో-

ఇకచాలు దయ చేయమని వెనుదిరిగాను. ఇదంతా కిటికీ గుండా మీకు వినిపించే ఉంటుంది. ఆమె దాష్టీకం మీరు వినవలెననే కాంక్షతోనే ఈ బాతాఖానీ సాగించినట్లు నాకుతోచింది. ఒకవేళ మీరు ఆమెను సపోర్టు చేస్తే చేశారుగాని, మా మీద కెందుకండి ఆమె ధ్వజమెత్తడం? ఆనేటి వక్రానికి తమ దగ్గర ఏదైనా మందు ఉంటే ఇచ్చి ఆమెనూ, ప్రజలను కొంచెం రక్షించండి; పుణ్యముంటుంది.

***

నా సిన్సియర్ ఒపీనియన్ అప్పల నర్సమ్మగారూ! మీరు మర్యాదగా రాజీనామా ఇవ్వటం బాగుంటుందని-ఇన్నిరోజులుగా మున్సిపాలిటి తప్పొప్పులను దిద్దలేక, ఆస్పత్రిని చేపల బజారు చేసింది. ఔను! స్వార్థపరులగు కొందరు కౌన్సిలర్లు అభిమానాలతో వ్యక్తులను సపోర్టు చేసేటప్పుడు యిక న్యాయమెట్లా పరిష్కరించ బడుతుంది.

"తప్పరయని నృపురాజ్యము దెప్పరమై మీద కీడు దెచ్చుర సుమతీ!"

".... మెత్తనైనను అధికారము మెత్తనైన అది రోతయగున్" అన్నాడు కవి చౌడప్ప.

### ఈనాడు

ఆచార్య ఆత్రేయ విరచిత "ఈనాడు" నాటకాన్ని వెంకటగిరి వారు మన లలిత కళానిలయము వారి యాజమాన్యమున, తిక్కవరపు రామిరెడ్డిగారి సమాదరమున గత 15 తేది నెల్లూరులో ప్రదర్శించిరి. వీరే మొన్నటి నాట్య కళాపరిషత్తులో విజయ ఢంకా బజాయించి ప్రథమ బహుమతిని చేజిక్కుంచు కొన్న ఉత్తమ కళోపాసకులు.

ప్రదర్శనానికేకాదు రచనకు కూడా ప్రథమ బహుమతి ఇచ్చి ఉండవలసింది. అయితే న్యాయ తీర్పరులు తలా ఒకటి పుట్ట చెబుదాం అనే ధోరణిలో వ్యవహరించి నట్లుంది; పోనీయండి, యింత మాత్రం చేత మన బంగారానికి వెలతగ్గి పోతుందా?

**పాత్రధారులు**

| | |
|---|---|
| అక్బర్ | : డా. దామోదరం |
| రాం | : ఈశ్వరదాస్ |
| రహీం | : ఆత్రేయ |
| నసీం | : సురభి సరస్వతి |
| డాక్టర్ | : పి. జయరాం నాయుడు |
| వత్సల | : రాజేశ్వరి |
| పురుషోత్తం | : జగన్నాథ ప్రసాద్ |

ఇందులో అందరూ ప్రతిభావంతంగా నటించినవారే. వారెవా! ఆ అక్బరూ, పురుషోత్తం, నసీం - ఏం కళాకాంతులు విరజిమ్మినారండీ! ఎవర్నితీసి వేద్దాం యిందులో-

ఆ రసానుభూతిని వర్ణించాలంటే నాకు భాషాభావాలు చాలవంటే నమ్మండి. సముద్రమంతా ఉప్పొంగింది. వచన నాటకం యింత మనోజ్ఞంగా రక్తి గట్టిందంటేనే చాలు. వస్తువు - ప్రస్తుతానికి ఉపకరించే హిందూ - ముస్లిం ఐక్యతా సాధన. నేటి మతోన్మాద రక్త ప్రవాహానికి కారణం మూడవవాడని చూపబడింది.

కొందరు నాటకం విషాదాంతం కంటే మంగళాంతంగా ఉండి ఉంటే బాగుండేదని అభిప్రాయ పడ్డారు. "కొందరికి తెనుగు గుణంబగు - కొందరికి సంస్కృతంబు గుణంబగు - రెండుం కొందరికి గుణములగు-"

ఆత్రేయను రు116లతో సత్కరించి ఆంధ్ర నాటక కళా పరిషత్తు వారి పొరపాటును సరిదిద్దారు - మన లలితా కళా నిలయం వారు. రసజ్ఞులు తిక్కవరపు రామిరెడ్డి గారు కూడా కీర్తించారు. కవీ, ప్రదర్శకులూ మున్ముందు ఆంధ్ర నాటక కళా సరస్వతిని తమ భావ సుమాలతో మరింతగా ఆరాధింతురు గాక!

-నెల్లూరు వెంకట్రామా నాయుడు

## రాయి తురాయి

8వ పేజీ తరువాత

జరుగుతుంది. అయితే సాధారణ పాఠకుడికి అది కూడా కొరక రానికొయ్యే.

కథ ఒకే ఒక సంఘటనతోను, లేదా పెక్కు సంఘటనలతోను ముడిపడి ఉండవచ్చు; లేదా పాత్రగతంగా స్వభావ చిత్రణమూ కావచ్చు. వీటి ప్లాట్లలో విస్తృతి తప్పదు. ఇది సాధారణంగా మనం `కథ' అని పిలిచే వాటి సంగతి.

మరీ చిన్న చిన్న కథల్లో నిడివిని తగ్గించి నిగ్గును పెంచడం జరుగుతుంది. లోతు పెరిగి పొడవు తరిగి పోతుంది. ఇటువంటి కథలు మన పురాణేతి హాసాల్లోనూ (మరీ కార్డుసైజువు కావులేండి) బైబిల్లోనూ మనకు తటస్థ మవుతాయి. బృహత్ గ్రంథాలైన పురాణేతి హాసాల్లో విస్తృతిని తగ్గించడానికి బాగా కుదించి ఉపాఖ్యానాలను, ఉదంతాలను బాగా రాయటం జరుగుతుంది. కాని, వీటిని కథలు అనడం కంటే ఉదంతాలు, వృత్తాంతాలు (Anecdotes) అని పిలువ వచ్చునను కొంటాను.

విశ్వనాథరెడ్డి రాసిన `మారుచీర' కథను పాఠకుల సౌలభ్యం కోసం అక్షరం మార్పు లేకుండా యథాతథంగా ఇస్తున్నాను. పరికించగలరు.

"ఆరోజు ఉమెన్సు కాలేజీ డే నాటకంలో సీత ఒక పేద పిల్ల వేషం వేసింది. అరుణ బాగా డబ్బుండే అబ్బాయి పాత్ర వేసింది. నాటకంలో... బాగా డబ్బుండే అబ్బాయి... పేద పిల్లను గాఢంగా ప్రేమించి హిందీ సినిమాల్లోలాగా వెంట తిరిగి తిరిగి ఎన్నో ధైర్య సాహసాలు చూపించి, తల్లీ దండ్రుల్ని ఎదిరించి పెళ్లి చేసుకొంటాడు. నాటకం అయిపోయింది; వాళ్లిద్దరి వేషాలు చాలా బాగా కుదిరాయని ఇద్దరూ బాగా నటించారనీ అందరూ మెచ్చుకొన్నారు.

పేదపిల్ల వేషం వేసిన పిల్ల చుట్టూ విద్యార్థినులే,; గ్రీన్ రూంలో దుస్తులు మార్చుకొంటూ అరుణ, సీతను అడిగింది. సిగ్గుపడుతూ-

"నా చీరను ఇవ్వవే."

"అయ్యో రామ! ఈ ముష్టి చీరను మళ్లీ కట్టుకుంటావే? ఏదో నాటకంలో కట్టుకొన్నాను గాని... పైగా ట్రాజిక్ ఎఫెక్టు కోసం నీచీర చిరుగులు పెద్దవి చేశానే!" అంది సీత "నాకుండే మారు చీర అదేనే" అరుణ గొంతు వణికింది. కథ అయిపోయింది. కాని ఇది కంచికి పొయ్యే కథ మాత్రం కాదు. చదువరుల బుర్రల్ని తొలిచే కథ. తలపుల వాకిళ్లను తెరిచే కథ. ఇక విశ్వనాథరెడ్డి చెప్పకనే చెప్పిన విషయాలు; అంటే మనం Between the lines చదువుకోవలసినవి-

సీత మంచికలిమిగల ఇంట్లో పుట్టి పెరుగుతున్న అమ్మాయి; అరుణ లేమిలో లేకిబ్రతుకు ఈడుస్తున్న పిల్ల; నాటకంలో పాత్రోచితమైన వేషధారణ కోసం సీత, అరుణ చీరను ఎరవుగా తీసుకొన్నది. డబ్బుండే అబ్బాయి పాత్ర ధరించిన పేద అరుణ కూడా బాగా నటించింది. అయినా విద్యార్థినులందరూ పేద పిల్ల వేషం వేసిన భాగ్యవంతుల అమ్మాయి సీత చుట్టు మూగారు. ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. లోకం పోకడే అంత. సిరి గలవారి బిడ్డ నిరుపేద పిల్లను ప్రేమించి, సాహసాలు ప్రదర్శించి పెళ్లాడటం సినిమాలలో తప్ప నిజ జీవితాల్లో జరిగే పనికాదు. విశ్వనాథరెడ్డి తెలుగు సినిమాలు చూడలేదేమో? - హిందీ సినిమాలనే పేర్కొన్నారు. హాలివుడ్‌కు ఇమిటేషన్ బాలీవుడ్; బాలీవుడ్‌కు అంధానుకరణమే టాలీవుడ్. కాసుల మార్కెట్టులో కళను పట్టే దుర్గతికి ఏ `వుడ్' అయినా ఒకటే. విద్యార్థినులు ప్రదర్శించిన నాటకేతి వృత్తం కూడా సినిమాలకు అనుకరణేనని, మన నాటిక రంగం బల్ల పరుపుగా పాకుతుందే తప్ప, నిటారుగా ఎదగడం లేదని రచయిత నర్మగర్భ వ్యాఖ్య.

తన చీరను తనకివ్వమని అరుణ అడిగినప్పుడు సీత అన్న మాటలూ, మార్క్సు చెప్పిన వర్గ స్వభావానికి సూచికలు. ఇది చాలదన్నట్లు ట్రాజిక్ ఎఫెక్టు కోసం చినిగి ఉన్న చీరను మరింత ఎక్కువగా చించడం - అదంతా ధనికులకు పేదలయెడ ఉండే నిరాదరణకు, అసహనానికి మాత్రమే నిదర్శనం కావడం - అసలే బీదపిల్ల, చినిగిన చీరకట్టుకొని కాలేజికి వచ్చింది. ఆమె కుండే మారుచీర అదొక్కటే. అయినా దాన్ని ట్రాజిక్ ఎఫెక్టు కోసం మరింతగా చించితే పాపం ఆ బీద పిల్ల మానం మరింత ట్రాజిక్‌గా ఉండదా? అనే సాటి మనిషి పట్ల ఉండవలసిన సానుభూతి, సదవగాహన లేకపోవడం ధనికుల బుద్ధి. కారల్‌మార్క్సు దార్శనికతలోని అంశాలే. ఒక్కమాటతో చెప్పాలంటే వర్గ స్వభావం. మార్క్సు సూత్రాన్ని చెప్పిన వాచ్యం చెయ్యకుండా ఒక కార్డు సైజు కథలో కారల్‌మార్క్సు చెప్పిన `వర్గ స్వభావా'న్ని వ్యంజితం చెయ్యడమే ఈ రాయలసీమ రెడ్డి బిడ్డ చూపిన పనితనం.

## చిత్రసమీక్ష

9వ పేజీ తరువాత

వుండాలి అనేది ఈ అభ్యుదయ పోరాటంలో ఒక అంశం ఎందుకు కాకూడదు? అది అసభ్యం, అవాంఛనీయం అని భావించినప్పుడు కట్టుకున్న భార్యకు అన్యాయం చేస్తూ, మగాడు సాగించే లైంగిక స్వేచ్ఛను ఎందుకు అరికట్ట కూడదు? సమాజంలో పవిత్రతను ఇరువైపుల నుంచి ఎందుకు నిలబెట్ట కూడదు?

ఆలోచింపజేసే ఈ విషయాల ప్రాతిపదికగా, లైంగిక స్వేచ్ఛ ప్రధానాంశంగా చేసుకొని హిందీ సినిమా రంగం కొన్ని చిత్రాలను నిర్మించింది. అదే మార్గంలో ఇటీవల మీరా నాయర్ తన దర్శకత్వంలో హిందీలో రూపొందించిన "కామసూత్ర" చిత్రాన్ని సమాజం ముందు వుంచింది. లైంగిక స్వేచ్ఛను సమర్థించాలా, సమాధి చెయ్యాలా అనే వేడి ప్రశ్నగా ఈ చిత్రం సమాజం ఎదుట ధీటువుగా నిలుస్తుంది. "అభ్యుదయం స్త్రీ" అనే పదం సమాజంలో ఒక నినాదంగా మారు మ్రోగాలన్నది ఈ చిత్రం ధ్యేయం. ఆ నినాదం వాస్తవ రూపం దాల్చి మగ, ఆడా మనస్తత్వాల్లో మార్పును సాధించి తద్వారా సమాజం పరివర్తనకు దోహద పడాలన్నది ఈ చిత్రం అపూర్వ కోరిక. ఇది అసభ్యకర చిత్రం కాదు, సమాజానికి సభ్యత నేర్పే చిత్రం.

ఈ చిత్రాన్ని హిందీ నుంచి తెలుగులోకి డబ్ చేసి అదే పేరుతో విడుదల చేశారు. విలాస పురుషుడైన ఒక రాజా మరో జమిందారీ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. పెళ్లి తర్వాత భార్య తోపాటు తన ఇంటికి వచ్చిన అమె వెలికత్తెతో లైంగిక సంబంధం పెట్టుకుంటాడు. భర్తతోటిదే లోకం అనుకుంటుంది భార్య. కొంత కాలానికి రాజా వద్ద పొందలేని తృప్తిని భర్తీ చేసుకునేందుకు ఆ వెలికత్తె మాత్రంమరో అస్థాన శిల్పితో సంబంధం పెట్టుకుంటుంది. అది సహించలేని రాజు ఆమె ప్రియుణ్ణి చంపేస్తాడు. వెలికత్తె మరోకర్ని వెతుక్కుంటూ వెళ్లి పోతుంది.

లైంగిక స్వేచ్ఛను అనుభవించే పాత్రల చిత్రణ, అభ్యుదయ స్త్రీ పాత్ర చిత్రణ ఈ చిత్రంలో చక్కగా జరిగింది. లైంగిక స్వేచ్ఛను అభ్యుదయంలోని అంశంగానే స్వీకరించేందుకు సమాజం సిద్ధ పడుతుందా! లేక కామసూత్రకు గాక మంగళ సూత్రానికే విలువ నివ్వాలన్న దృక్పథాన్ని ప్రకటిస్తుందా? ఈ అంశాలు చర్చనీయంగా వుంటాయి.

దర్శకత్వంలోని ప్రతిభ చిత్రమంతా కనిపిస్తుంది. పడకగది సన్నివేశాలు, అర్ధ నగ్న దృశ్యాలు, శృంగార చేష్టలు సున్నితంగా పరిమితంగానే చూపబడ్డాయి. నటీనటులంతా బాగా నటించారు. మంగళ సూత్రం లేకుండా కామసూత్ర నేపథ్యంలో వేశ్యవృత్తిని జీవనంగా వుంచుకున్న స్త్రీలలో అనాది నుంచి అన్ని లలిత కళలూ జీవించాయి. విలాస పురుషులకు హాయిని ప్రవహింప జేశాయి. ఈ నగ్న సత్యం చిత్రంలో విశద పరచబడింది. రేఖ నాట్యకత్తెగా, కామసూత్రాలు నేర్పుతూ తన పాత్రను ఆకర్షణీయంగా పోషించింది. ప్రతి పురుషుణ్ణి, స్త్రీని ఆలోచింప జేసే చిత్రమిది.

## సినిమా

9వ పేజీ తరువాత

### భానుమతి నటించే చిత్రం

"చాలా కాలం తర్వాత నటిస్తున్నాను," అన్నారు భానుమతి. ఈమె కోడి రామకృష్ణ దర్శకత్వం వహించే ఎస్‌వీఎస్. క్రియేషన్స్ చిత్రంలో నటిస్తోంది. జగపతిబాబు సరసన కొత్త నటి లక్ష్మీతో పాటు సుధాకర్, చలసాని కృష్ణారావు, వీరన్ చౌదరి, మల్లికార్జునరావు, సన, రజిత పాత్రధారులు.

### సూర్య పుత్రిక

"యాదా కృష్ణ" అనే హీరోను పరిచయం చేస్తున్నాం," అన్నారు తోటకృష్ణ ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తయారయ్యే "సూర్యపుత్రిక" చిత్రంలో ఇంద్రజ నాయిక. చంద్రమోహన్, తనికెళ్ల భరణి, బాబూమోహన్, పిఎల్. నారాయణ, రాళ్లపల్లి, లతాశ్రీ, అన్నపూర్ణ పాత్రధారులు. మాటలు: పిఎల్. నారాయణ, సంగీతం: కె. లక్ష్మణ్‌సాయి. పాటలు సి. నారాయణరెడ్డి, చంద్రబోస్, సుద్దాల అశోక్‌తేజ.

### మీ ఆయన జాగ్రత్త!

"మార్చి 10కి చిత్రీకరణ ముగుస్తుంది," అన్నారు ముత్యాల రాందాసు. ఈయన దర్శకత్వం నెరిపే "మీ ఆయన జాగ్రత్త" చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, రోజా, బ్రహ్మానందం, కోట శ్రీనివాసరావు, ఎవిఎస్., బాబూమోహన్, శివాజీరాజా, వల్లభనేని జనార్దన్, దువ్వాసి మోహన్, రక్ష, లతాశ్రీ నటవర్గం. మాటలు: మరుధూరి రాజా

## కాంగ్రెస్

8వ పేజీ తరువాత

కనపించలేదు. డివిజన్‌లో సమస్యాత్మక గ్రామాలుగా ప్రకటించుబడ్డ వరగలి, ఈదగాలి, మొవిడిలలో ప్రశాంతంగా పోలింగ్ జరగడం హోషం. మందకొడిగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ జరిగినా గూడూరులో మొత్తానికి 68.2 శాతం; రాపూరులో 67 శాతం పోలింగ్ నమోదయ్యింది.



రేగటి చిత్తూల నవల అభినందన సభలో రచయిత్రి చంద్రలత, సిని రామచంద్రరావు, ఓల్గా, చేకూరి రామారావు

## జిల్లావార్తలు

8వ పేజీ తరువాత

పాల్గొన్న చదలవాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ తన సోదరుడి స్మారకార్థం నేత్ర చికిత్సా శిబిరం నిర్వహించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఇటువంటి శిబిరాలకు చేయూత అందిస్తానన్నారు. సభకు క్లబ్ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ అధ్యక్షత వహించారు. డాక్టర్లు వై.జె. ప్రభాకరరెడ్డి, జి. కృష్ణమూర్తి, జెవి. ప్రసాద్, ఎం.సి. నరసింహులు, రామసుబ్బారెడ్డి, లయన్ బి. సురేంద్రనాథ్ వేదికపై ఆశీనులయ్యారు.

## కవిత్రయం

4వ పేజీ తరువాత

కొని, ఆమెను అమలాపురం నుంచి తీసుకొని వచ్చి, ఆమెను ఇరకాటంలో పెట్టి, శ్రోతలను ఇక్కట్ల పాల్జేశారే - వాళ్లను కొనియాడాలి వేనోళ్లతో!

మలినాటి సభాధ్యక్షుడు వొమ్మిన సుబ్రహ్మణ్యం; పచ్చిపులుసు వెంకటేశ్వర్లు "భాగవతంలో అభ్యుదయం" అనే అంశంపై ఉపన్యసించారు.

మూడవనాటి తిక్కన జయంతి సభకు అగ్రాసనాధిపతి అగస్త్యరెడ్డి వెంకురెడ్డి; తిక్కన తేట తెనుగు నుడికారపు ఇంపు సొంపులను ప్రస్తావించారు. విఆర్. కళాశాల ఆంధ్ర శాఖాధ్యక్షులు వొప్పూరు వేణుగోపాలయ్య తిక్కన భారతంలోని `కపోతోపాఖ్యానము', `నాడీ జంఘోపాఖ్యానము'లలో తిక్కన చూపిన కళాకౌశలమూ, సంవాదశైలి, రాజనీతి, సాంఘిక విషయాలపై తిక్కన చేసిన ప్రబోధాలు - రస భావాను గుణ్య శబ్దప్రయోగ దక్షత - ఇత్యాది విషయాలపై అమోఘమైన ప్రసంగం చేసి రసజ్ఞులను మెప్పించారు. ఈయేటి కవిత్రయ జయంతి సభల్లో వేణుగోపాలయ్యగారి ప్రసంగ మొక్కటే హైలైట్.

కవిత్రయ జయంతులు గాడి తప్పడమే కాదు - పాడిదప్పి కూడా చాలా కాలమైంది. కవిత్రయ జయంతుల్లో కవిత్రయం వారిని గురించిన ప్రసంగాలే ఏర్పాటు చేసి ఔచిత్యాన్ని విడలదాల్చే వారు గతంలో; మధ్యలో ఎక్కడో, ఎందుకో పొరపాటు జరిగిపోయింది. ఇకనైనా సరిదిద్ది యథాపూర్వ స్థితిని పునరుద్ధ రించగలరని సూచన. *

## నెల్లూరు సంగతులు

4వ పేజీ తరువాత

ఎన్నికలలో మరీ దిగజారి ప్రవర్తించారని జిల్లా మహిళా కాంగ్రెస్‌అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ ఆరోపించారు.

జిల్లాలో అధికశాతం ముస్లింలు పోలింగ్‌లో పాల్గొని కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటేసి నందుకు కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షుడు ఎస్.ఎం. హుస్సేని కృతజ్ఞతలు చెప్పారు.

### రక్తిగట్టిన `పరమహంస' జయంతి

వర్ధమాన సమాజ యాజమాన్యంలో 18తేదిన టౌన్‌హాల్‌లో జరిగిన సభ రంజన కెక్కింది. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఎ. రాజసింహ మాట్లాడారు. అగస్త్యరెడ్డి వెంకురెడ్డి అధ్యక్షుణ్ణి, ఉపన్యాసకుణ్ణి సభకు పరిచయం చేశారు. వేదాంతం గహనమైందనీ, మహాత్ముల మాటల మాటున గంభీరమైన భావం దాగి ఉంటుందనీ, దాన్ని వెదకి పట్టుకోగల శక్తి సామర్థ్యాలు చదువరులకు ఉండాలన్నాడు. పరమహంస తాను తీపి పదార్థాలు తింటున్నట్లు ఒకానొక సందర్భంలో వాచా చెప్పినప్పటికీ, నిజానికి పరమహంసకు స్వీట్లు తినే జిహ్వా చాపల్యం లేదని నిరూపించాడు. సత్పురుషుల మాటతీరే వేరన్నాడు.

సభా పోషకుడు మలుచూరు ధర్మారెడ్డి చేత సన్మానితుడైన పిమ్మట ప్రధాన ఉపన్యాసకుడు డాక్టర్ కె. నరసింహారెడ్డి అసాధారణ ధారణ పటిమతో పుంఖాను పుంఖంగా పద్యాలను అలవోకగా వల్లిస్తూ, పరమహంస పారమార్థిక జీవిత విశేషాలను, ఆయన రసజ్ఞతను, బోధనలను, సూక్తులను ఒకదాని వెంబడి మరొకటిగా చక్కగా వివరించి సదస్సుల ఉల్లాసాన్ని లెస్సగా కొల్లగొన్నాడు. కార్యదర్శి పొన్నాల రామసుబ్బారెడ్డి వందన సమర్పణతో సభ ముగిసింది. *


Dial ***
323436
323445
327603
EXIDE Battery at your door step
EXIDE
INDUSTRIES LIMITED


Authorised Sales & Service Dealer's
INDUSTRIAL DIESELS
NELLORE

# సర్వేపల్లిలో చీప్‌లిక్కర్ ప్రవహింప జేశాడు మంత్రి!

అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా చూస్తే ఒక్క కోవూరు మినహా తతిమా అన్ని స్థానాలలోనూ కాంగ్రెస్‌కు మంచి మెజారిటీ వచ్చే అవకాశం కన్పిస్తూంది.

### నెల్లూరులో సిపిఎం మూడవ స్థానమే!

నెల్లూరు టౌన్‌లో సిపిఎం పరిస్థితి చాలా దయనీయంగా వుండింది. ఎంత ప్రయత్నం చేసినా ఓటరులో కనీసపాటి సానుభూతి సంపాదించ లేకపోయారు వారు. నెల్లూరులో కాంగ్రెస్ ఎన్నికల యంత్రాంగం ఫెయిలైందని; ఏజంట్లు కూడా లేరని; అందువల్ల తమకు ఆధిక్యత వస్తుందని సిపిఎం నేతలు చెప్తున్నారు. యంత్రాంగం సంగతేమో కాని, ఓటింగ్ తీరులో మాత్రం ఆ సూచనలు కన్పడలేదు. గత ఎన్నికల్లో 13764 ఓట్ల మెజారిటీ వచ్చింది ఇక్కడ; అది ఈసారి 20వేలకు పెరిగే అవకాశం కన్పిస్తూంది. గతంలో మొత్తం పోలైన ఓట్ల సంఖ్య 1,07,078 (46.3 శాతం); ఈ సారి లక్షా 25వేలా 668 (54.3శాతం) పోలైనాయి. ఈ పెరిగిన ఓట్లలో సగం కాంగ్రెస్‌కు పడినా మెజారిటీ దాదాపు పాతికవేలకు చేరిపోతుంది. ముస్లింలు పెద్ద సంఖ్యలో ఓటుకు వచ్చారు. అది కాంగ్రెస్‌కు బలం చేకూర్చింది.

తర్వాతి స్థానం బిజెపిది. టౌన్‌లో వారు చాలా ఉత్సాహంగా కన్పించారు. మధ్య తరగతి ఓటర్లు వారినే వరించారు. గత పర్యాయం వారికిక్కడ పడిన ఓట్ల సంఖ్య కేవలం 15వేలా 99. ఈసారి అది 30వేల వరకు వుండవచ్చు. సిపిఎం కేవలం 15 నుంచి 20వేల ఓట్లతో కడ స్థానానికి దిగజారి పోతుందని అంచనా.

### సర్వేపల్లిలో సారా ప్రవాహం

మద్యపాన నిషేధం కోరుతూ తాను పాదయాత్రలు చేసిన సర్వేపల్లి గ్రామాలలోనే సారా ప్రవహింప జేసాడు మంత్రి చంద్రమోహన్ రెడ్డి. పూరూరా వేల సంఖ్యలో చీప్ లిక్కర్ సీసాలను దించారాయన. సారా పోస్తే జనం ఓట్లేస్తారనే చవకబారు అభిప్రాయం ఆయనలో ఎందుకు కల్గిందో మరి! అదంతా వృధా శ్రమ, ఖర్చు; సర్వేపల్లిలోనూ కాంగ్రెస్, బిజెపిలే పోటీ పడ్డాయి తప్ప సిపిఎం పోటీలోకి కూడా రాలేదు. గత పర్యాయం ఇక్కడ కాంగ్రెస్‌కు 4వేలా 71 ఓట్ల మెజారిటీ వచ్చింది. సారి అది 10 నుంచి 15వేలకు పెరుగుతుందని అంచనా. గతంలో వచ్చిన 15176 ఓట్ల సంఖ్యను ఈసారి బిజెపి రెట్టింపుకు పైగా పెంచుకో బోతున్నది. సిపిఎం ఓట్లు 33579 నుంచి 15 వేల ప్రాంతానికి దిగజారి పోవచ్చు. బిజెపి అభ్యర్థి తరఫున ఆ పార్టీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి సైతం మంత్రితో పోటీ పడి చీప్‌లిక్కర్ సరఫరా చేశారు. ఇప్పుడు కష్టపడి పార్టీని మెరుగు పరిస్తే, రేపు అసెంబ్లీ

**నెల్లూరు ఫలితం**
(5వ పేజీ తరువాయి)

ఎన్నికల్లో ఇక్కడ తానే అభ్యర్థి కాబట్టి విజయావ కాశాలుంటాయని భావించిన నట్లున్నారాయన.

### కోవూరులోనూ కనాకష్టమైంది

సిపిఎంకు ఆధిక్యత కాని, కనీసం రెండవ స్థానపు అవకాశం కాని వుండేది ఒక్క కోవూరులోనే. అది సిపిఎంకు బలమైన స్థావరం కావడం, ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి చిత్త శుద్ధితో పని చేయడం అందుకొక కారణమైతే - కాంగ్రెస్‌కు సరైన నాయకత్వం లోపించడం మరొక కారణం. ఈ రెండు అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలోనూ సిపిఎం విఫలమైంది. గతంలో వారికిక్కడ 26,341 ఓట్లు వచ్చాయి; ఈసారి అవి 30 వేలకు పెరుగుతాయని అంచనా; బిజెపి ప్రమేయం అంతగా కన్పించ లేదు. కాంగ్రెస్ ఓట్లు కూడా 27524 నుంచి 30 వేలకు చేరుకునే అవకాశం వుంది. ఇద్దరి మధ్య తేడా చాలా స్వల్పంగా వుండబోతుంది. కనాకష్టంగా ఎవరో ఒకరు ఒక వెయ్యి ఓట్లు మెజారిటీ తెచ్చుకో బోతారు.

### ఆత్మకూరు అసత్య ప్రచారాలు

ఆత్మకూరులో సిపిఎంకు 20 వేల మెజారిటీ వచ్చి తీరుతుందని ఢంకా భజాయించి చెప్తున్నారు ఆనం సంజీవరెడ్డి గారు. కండ్లేరు రిజర్వాయర్‌లో తన అక్రమార్జన నుంచి 20 లక్షల వరకు గుమ్మరించాను కాబట్టి ఆ మేరకు ఫలితం వుండబోతుందా అన్నది ఆయన ఆశ. ఆత్మకూరులో కాంగ్రెస్ మూడవ స్థానంలోకి వెళ్లి పోయిందనే అభిప్రాయం కల్పించా రాయన. అది తప్పు. పరిస్థితి అందుకు పూర్తి వ్యతిరేకం. ఆత్మకూరులోనూ సిపిఎం గతి దుర్గతే. లక్ష్మయ్య నాయుడు అనుచర వర్గం సమస్తం బిజెపికి ఓట్లేసిందక్కడ. తెలుగుదేశం ఓట్లను పెద్ద ఎత్తున బిజెపి, కాంగ్రెస్‌లు పంచు కున్నాయి. గతంలో ఈ స్థానంలో సిపిఎం 171 ఓట్ల మెజారిటీ సాధించింది. ఈసారి 5 నుంచి 10 వేల మధ్యలో మైనస్ పడిపోవచ్చు.

పొదలకూరు, కలువాయి, అనంత సాగరం మండలాలలోకాంగ్రెస్‌కు మంచి వాతావరణం కన్పించింది. సంగం, ఎఎస్‌పేట, ఆత్మకూరు టౌన్‌లలో బిజెపి ఆధిక్యత కన్పించింది. ఒక్క చేజర్లలో మాత్రమే సిపిఎంకు అవకాశం. మొత్తం నియోజక వర్గంలో మెజారిటీ సాధించేటన్ని ఓట్లు చేజర్లలో వస్తాయా? అసంభవం. ఆనం సంజీవరెడ్డి స్వంత గ్రామమైన కామిరెడ్డిపాడులోనూ కాంగ్రెస్‌కే అధికంగా ఓట్లు పడ్డాయని అంచనా.

### రాపూరులో కాంగ్రెస్ జోరు-బిజెపి బలహీనం

రాపూరులో కాంగ్రెస్‌కు వచ్చే మెజారిటీ చాలా అధికంగా వుంటుంది. ఇక్కడ బిజెపి చాలా బలహీనంగా కన్పించింది. వారికి సరైన నాయకత్వం లేదు, ప్రచారం లేదు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ 9163 ఓట్ల మెజారిటీ సాధించింది. అప్పుడు

తరువాయి 7వ పేజీలో

## ఒంగోలు రీపోలింగ్‌లో జోక్యానికి తలవాచే చీవాట్లు!

# మర్యాద తప్పితే ప్రాసిక్యూట్ చేయాల్సి వస్తుంది!

ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడును కేంద్ర ఎన్నికల సంఘంలోని ఒక సీనియర్ అధికారి ఎన్నికల అక్రమాలపై చాలా సీరియస్‌గా మందలించినట్లు విశ్వసనీయ సమాచారం. ఒంగోలు నియోజక వర్గంలో రీపోలింగ్ విషయమై ఆయన చీవాట్లు తిన్నారని చెప్తున్నారు.

16తేది పోలింగ్ అక్రమాలపై కాంగ్రెస్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించి, చాలా కేంద్రాలలో రీపోలింగ్ జరిపించమని అభ్యర్థించారు. దీనిపై ఒక నిర్ణయం తీసుకొనే సమయంలో కలెక్టర్‌కు ముఖ్యమంత్రి నుంచి ఫోన్ కాల్ వచ్చిందట. అప్పుడు కలెక్టరేట్‌లో ఇంకొక గదిలో ఎన్నికల పరిశీలకుడూ వుండినారట. సిఎం నుంచి కాల్ అని వినగానే ఆయన ప్యారలల్ ఫోన్ ఎత్తుకొని, కలెక్టర్‌తో సిఎం సంభాషణ మొత్తం విన్నారట. కాంగ్రెస్ వాదులు కోరిన ప్రకారం రీపోలింగ్ పెట్టవద్దు, నామాట వినకుండా నువ్వు నిర్ణయం తీసుకొంటే ఆ తర్వాత

**ముఖ్యమంత్రికి ఎన్నికల కమీషన్ సీరియస్ వార్నింగ్**

చాలా సమస్యలు ఎదుర్కొంటావు అని కలెక్టర్‌ను బెదిరించారట సిఎం.

ఈ హెచ్చరిక విషయం వెంటనే ఢిల్లీలోని ఎన్నికల అధికారులకు సమాచారం అందించారట పరిశీలకుడు. దానితో వారు క్రుద్ధులై పోయారు. ముఖ్యమంత్రికి ఫోన్ చేసి - "మర్యాద కల్గిన పదవిలో వున్నారు మీరు; ఆ పదవి మర్యాద కాపాడవలసిన బాధ్యత మీపై వుంది; మరొకసారి ఎన్నికల అధికారులను బెదరించినట్లు తెలిస్తే ఆ మర్యాద కోల్పోవడమే కాదు, మిమ్మల్ని ప్రాసిక్యూట్ చేయాల్సి వుంటుంది జాగ్రత్త" అని వార్నింగ్ ఇచ్చారట వారు. ఆ దెబ్బకు సిఎంకు దిమ్మ తిరిగి పోయింది. దొంగకు తేలుకుట్టినట్లు గమ్మున వుండి పోయాడు. కలెక్టర్ కాంగ్రెస్ వాదులు కోరిన 20 బూత్‌లలోనూ రీపోలింగ్‌కు ఆదేశాలిచ్చినా సిఎం తోపాటు మరే తెలుగునేతా ఉలకలేదు, పలకలేదు.

ఒంగోలు పరిశీలకుడు అప్రమత్తంగా వుండి, ఆ సంభాషణ విని, పై అధికార్లకు ఫిర్యాదు చేయబట్టి ఇక్కడ సిఎం అరాచకత్వం అమలులోకి రాలేదు. అటువంటి ప్రతిస్పందన లేని సమయాలలో రాష్ట్రంలో ఇతర చోట్ల చంద్రబాబు కలెక్టర్, ఎస్‌పిలను ఎంతగా బెదరించాడో, ఎంతగా వేధించాడో ఎవరికి తెలుసు?

WORLD CLASS QUALITY FROM A WORLD CLASS COMPANY
KING AMONG CEMENTS
ISO 9002
COMPANY
Priya
53 GOLD
MEGA CEMENT
A Quality Product of PRIYADARSHINI CEMENT LIMITED

... Offset Printing at Aruna Graphics, Nellore